# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 57 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 57 18-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి హైకోర్టులో షాక్

2లో..



### మే 2న అమరావతికి

# రానున్న మోదీ

**ఆరోజు సాయంత్రం 4 గంటలకు రాజధాని పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమం**

**సచివాలయం వెనుక బహిరంగసభ వేదిక ఏర్పాటు**

అమరావతి ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ రాజధాని అమరావతిలో ప్రధాని మోదీ పర్యటించబోతున్నారు. అమరావతి నిర్మాణాల పునఃప్రారంభోత్సవానికి ప్రధాని హాజరుకానున్నారు. ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారయింది. మే 2వ తేదీ అమరావతికి మోదీ రానున్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు రాజధాని పనులను మోదీ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం వెనుక బహిరంగసభ వేదికను

- తరువాయి 2లో..

### దక్షిణాది రాష్ట్రాల్లో..

# 19 వరకు భారీ వర్షాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశంలో వాతావరణ పరిస్థితుల్లో ఆకస్మికంగా మార్పులు వచ్చాయి. ఈ క్రమంలో ఉత్తర ప్రాంతాలైన ఢిల్లీ ఎన్‌సీఆర్, హర్యానా, పంజాబ్, గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎండలు దంచి కొడుతున్నాయి. మరోవైపు దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కారైకల్, కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ, తెలంగాణ, కర్ణాటకతో సహా అనేక దక్షిణాది రాష్ట్రాల్లో రాబోయే 3 రోజులు ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేసింది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఇదే సమయంలో తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర వర్షాలు కురియనున్నట్లు వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఏప్రిల్ 17న బీహార్, అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్‌లోని గంగా నది ప్రాంతంలో బలమైన గాలులు (గంటకు 50%-%60 కి.మీ. వేగంతో) వీచే అవకాశం ఉందన్నారు. ఇదే సమయంలో అరుణాచల్ ప్రదేశ్‌కు ఏప్రిల్ 20 నుంచి 22 వరకు నిరంతర వర్షాలు ఉంటాయని వెదర్ రిపోర్ట్ వెల్లడించింది. భారత వాతావరణ శాఖ ప్రకారం, ఏప్రిల్ 17 నుంచి 19 వరకు పశ్చిమ, తూర్పు రాజస్థాన్‌లో వేడిగాలులు వీచే అవకాశం ఉంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో, గురువారం 40డిసి (గరిష్టంగా), కనిష్టంగా 25డిసి ఉష్ణోగ్రతలు

- తరువాయి 2లో..




### ఏపీలో ఎస్సీ వర్గీకరణ

# ఆర్డినెన్స్ జారీ

**ఇటీవలే ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్ కు కేబినెట్ ఆమోదం**

**తాజాగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదంతో గెజిట్‌ను జారీ**

**ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి ఉత్తర్వులు**

అమరావతి ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



రెండు రోజుల కిందట ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో, ఈరోజు ఏపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ చేసింది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం అనంతరం ఇందుకు సంబంధించిన

- తరువాయి 2లో..

### అమరావతిలో ఇంటర్నేషనల్


# క్రికెట్ స్టేడియం..!

అమరావతి ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐ 60 శాతం నిధులు అందిస్తున్నట్లు సమాచారం. ఏపీ ప్రభుత్వం మిగతా ఖర్చు భరిస్తుంది. 2027 నాటికి పూర్తి కానున్న ఈ స్టేడియంలో సంవత్సరానికి 10 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరుగనున్నాయి. భవిష్యత్తులో ఏపీకి ఐపీఎల్ టీమ్ కూడా లభించే అవకాశం ఉంది.**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే అమరావతిలో స్టేడియం నిర్మించాలని ఏపీ మంత్రి నారా లోకేష్, బీసీసీఐ కార్యదర్శి జైషాను కలిసిన సమయంలో కోరారు. దీంతో.. ఈ విషయంలో బీసీసీఐ కూడా సీరియస్‌గానే ఉన్నట్లు తెలుస్తోంది.

కాగా, అమరావతిలో ఇంటర్నేషనల్ స్టేడియం



- తరువాయి 2లో..

# భారత రాష్ట్రపతిని నిర్దేశించలేరు

### న్యాయవ్యవస్థపై ఉపరాష్ట్రపతి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భారత న్యాయవ్యవస్థ లక్ష్యంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులను ఆమోదించడానికి గడువును నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నాలుగు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి ఈ అంశంపై స్పందించారు. న్యాయవ్యవస్థను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో మాట్లాడారు. కోర్టులు రాష్ట్రపతిని నిర్దేశించే పరిస్థితి మనకు ఉండదని అన్నారు. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలను ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 142, "న్యాయవ్యవస్థకు 24/7 అందుబాటులో ఉన్న ప్రజాస్వామ్య శక్తులపై అణ్వాయుధ క్షిపణిగా మారింది" అని కూడా ఆయన అన్నారు. ఇలా ఉండగా, ఏప్రిల్ 13వ తేదీన రాష్ట్రాల గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతి తప్పనిసరిగా 3 నెలల్లోపు నిర్ణయం తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు తొలిసారిగా గడువును నిర్దేశించిన సంగతి తెలిసిందే. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి కూడా జ్యుడీషియల్ రివ్యూకు కట్టుబడి ఉండాలని ఆ తీర్పులో స్పష్టం చేసింది. తమిళనాడు అసెంబ్లీలో పాస్ అయిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ నెలల తరబడి పెండింగ్?లో పెట్టడాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్?తో కూడిన బెంచ్ ఈమేరకు సంచలన తీర్పును వెలువరించింది. "ఆర్టికల్ 201 ప్రకారం, ఒక బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి గవర్నర్ పంపినట్టయితే.. దానిని రాష్ట్రపతి ఆమోదించాలి, లేదంటే తిరస్కరించాలి. కానీ

- తరువాయి 2లో..



### యంగ్ గ్లోబల్ లీడర్‌గా

# రామ్మోహన్ నాయుడు

**అభినందించిన సీఎం చంద్రబాబు**

అమరావతి ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు ద్వారా ఈ ఏడాది యంగ్ గ్లోబల్ లీడర్‌గా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. గురువారం తన ఎక్స్ ఖాతా వేదికగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయడుకు సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు మన దేశానికి, మరి ముఖ్యంగా మన తెలుగు జాతికి గర్వ కారణమని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సేవను అంకిత భావంతో చేస్తున్నారంటూ రామ్మోహన్ నాయుడుపై ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. ఇది దేశంలోని యూవతకు స్ఫూర్తినిస్తుందన్నారు. మన రాష్ట్రంతో పాటు దేశ పురోగతికి కృషి చేస్తూ.. ప్రపంచ వేదికపై భారత్ స్వరాన్ని వినిపిస్తూ.. ఆయన నిరంతరం విజయాలను సాధించాలని

- తరువాయి 2లో..

### భూముల వివాదంపై 12 వారాలలో

# నివేదిక ఇవ్వాలని ఆదేశం



అమరావతి ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కొల్లేరు వాసులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయనే నమ్మకం పెరుగుతుంది. కొల్లేరు ప్రాంత జిరాయితీ భూముల యజమానులు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. అనంతరం కొల్లేరు వివాదానికి కారణమవుతున్న అంశాలపై 12 వారాల్లో నివేదిక ఇవ్వాలని కేంద్ర సాధికార సంస్థకు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో దశాబ్దాలుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలకి పరిష్కారం దొరుకుతుందనే ఆశతో కొల్లేరు వాసులు ఉన్నారు. కొల్లేరు ప్రాంతంలో 5వ కాంటూరు పరిధిలో ఉన్న ఆక్రమణలు తొలగించి సరస్సు సరిహద్దులు నిర్ధారించాలంటూ 2008లో సుప్రీం ఆదేశించినా.. అమలు చేయకపోవడంతో కాకినాడకు చెందిన మృత్యుంజయరావు అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలో ఎలాంటి ఆక్రమణలు, సహజ సిద్ధ నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు ఉండరాదని..

- తరువాయి 2లో..

# భారతి సిమెంట్స్ ఆస్తుల జప్తు

**-జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం**

అమరావతి ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. భారతి సిమెంట్స్ కార్పొరేషన్‌కు సంబంధించి ఈడీ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పునీత్ దాల్మియా కంపెనీలకు చెందిన రూ.793 కోట్ల ఆస్తులు జప్తు చేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది. దాల్మియా భారతి ఆస్తులను జప్తు చేసిన ఈడీ.. ఆ ఆస్తుల్లో దాదాపు రూ.377 కోట్ల విలువైన భూమి భారతి సిమెంట్స్‌లో క్విడ్ ప్రోకో జరిగిందన్న విషయాన్ని ఈడీ గుర్తించింది. కడప జిల్లాలో అక్రమంగా సున్నపురాయి గనులు, భారతి సిమెంట్స్‌లో దాల్మియా సిమెంట్ పెట్టుబడి పెట్టింది. 2011లో సీబీఐ కేసు నమోదు చేసింది. 2013లో చార్జిషీటు దాఖలు చేశారు. సీబీఐ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈ కేసులో ఈడీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసింది. భారతి సిమెంట్స్‌లో పెట్టుబడులు పెట్టినవారిపై దర్యాప్తు జరిపింది ఈడీ. సున్నపు రాయి గనుల లీజులో ఆయాచితి లబ్ధి పొందిన వారి

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# గనులకై యుద్ధం

మధ్యభారత అరణ్యాలలో ఆదివాసుల మీద, ఆదివాసుల జల్, జంగల్, జమీన్, ఇజ్జత్ పోరాటానికి మద్దతు ఇస్తున్న మావోయిస్టుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కత్తి గట్టడం, ఆ ప్రాంతంలోని అపారమైన, సంపన్నమైన ఖనిజ వనరులను కార్పొరేట్లకు అప్పగించే వ్యూహంలో భాగమే అని దాదాపు ఇరవై సంవత్సరాలుగా పరిశీలకులు, విమర్శకులు ఎందరో రాస్తున్నారు.

సల్వా జుడుం పేరుతో 2005లో పాలకులు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టిన ఆదివాసుల మధ్య అంతర్యుద్ధం నుంచి, ఇప్పుడు 2026 మార్చ్ 31 నాటికి మావోయిస్టు రహిత ఛత్తీస్‌గఢ్ తయారు చేస్తామని  ముహూర్తం నిర్ణయించి మరీ సాగిస్తున్న ఆపరేషన్ కగార్ దాకా మధ్య భారత అరణ్యాలలో చాలా నెత్తురు ప్రవహించింది. చివరి యుద్ధం అని చెప్పుకొంటున్న ప్రస్తుత దశ మొదలైన 2024 జనవరి 1 నుంచి గడచిన పద హారు నెలల్లో 400 మందికి పైగా ఆదివాసులను, మావోయిస్టులను భద్రతా బలగాలు చంపివేశాయి.

**ఖనిజ వనరుల కోసమే!**

మారణకాండ అంతా ఆదివాసులను భయభ్రాంతులకు గురిచేసి, స్వస్థలాల నుంచి వారిని నిర్వాసితులను చేసి, వారి కాళ్లకింది నేలలో నిక్షిప్తమైన సంపన్న ఖనిజ వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టడానికే అని విమర్శకులు చేస్తున్న అభియోగం నిజమేనని చూపే పరిణామాలు జరుగు తున్నాయి.

కార్పొరేట్ సంస్థల రక్షణ కోసం లెక్కలేనన్ని భద్రతా బలగాల క్యాంపులు నిర్మాణమవుతున్నాయి. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సశస్త్ర సీమా బల్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ వంటి సరిహద్దులను రక్షించవలసిన బలగాలు ఇప్పుడు మధ్య భారతంలో ఉన్నాయి. ఆ బలగాలను తీసుకుపోవడానికీ, తవ్విన ఖనిజాన్ని బైటికి తీసుకురావడానికీ నాలుగు లైన్ల, ఆరు లైన్ల రహదారుల నిర్మాణం బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వేగంగా జరిగిపోతున్నది.

ఈ 'అభివృద్ధి' కార్యక్ర మానికి అడ్డు వస్తారనే అనుమానం ఉన్నవాళ్ల మీదికి డ్రోన్లతో నిఘా, వైమానిక బాంబు దాడులు, వేలాది కాల్బలాలతో జల్లెడ పట్టి, చుట్టుముట్టి, ఎటువంటి ప్రతిఘటన లేకపోయినా కాల్చి చంపి ఎదురుకాల్పుల కథనాలు విడుదల చేయడం జరుగు తున్నది.

ఆ వరుసలోనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆ ప్రాంతంలో భూగర్భంలో నిక్షిప్తమై ఉన్న అత్యుత్తమ స్థాయి ఇనుప ఖనిజం (హెమటైట్) గనులను వేలం వేయడానికి శరవేగంతో ప్రయత్నిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ ఖనిజ వనరుల శాఖ 2025 జనవరి 15న సరిగ్గా ఈ హత్యాకాండల వార్తలు వస్తున్న దంతెవాడ, కాంకేర్ జిల్లాలలోని ఇనుప ఖనిజం గనుల బ్లాకులు నాలుగింటిని వేలం వేసే ప్రక్రియ ప్రారంభించింది. వీటిలో బైలదిల్లా గనులుగా ప్రఖ్యాతమైన ఖనిజ వనరుల కొండలు దంతెవాడ జిల్లా కిరందుల్ నుంచి బీజాపూర్ జిల్లా గంగలూరు దాకా వ్యాపించి ఉన్నాయి.

బైలదిల్లా డిపాజిట్ 1ఎ, 1బి, 1సి, కాంకేర్ జిల్లాలోని హాహాలొద్ది అనే ఈ నాలుగు బ్లాకుల వేలం ప్రక్రియ ఫిబ్రవరి 28 దాకా సాగి, 58 ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు పోటీ పడ్డాయి. చివరికి మూడు గనులను ఆర్సెలార్ మిత్తల్ నిప్పాన్ స్టీల్ ఇండియా, ఒక గనిని రూంగ్టా స్టీల్ దక్కించుకున్నాయి. ఈ రెండు కంపెనీలు కూడా ప్రభుత్వ వేలంపాటలో ప్రతిపాదించిన కనీస ధర కన్నా 154 శాతం, 160 శాతం ఎక్కువకు పాడు కున్నాయంటే, అక్కడ వారికి ఎంత లాభం చేకూరే అవకాశం ఉందో ఊహించవచ్చు. ఈ గనుల లీజు యాభై సంవత్సరాల పాటు ఉంటుంది గనుక ఇది రేపో మాపో వట్టిపోయే ఆవు కూడా కాదు, కామధేనువు! ఇప్పటివరకూ బైలదిల్లా గనుల్లోకి ప్రభుత్వ రంగ సంస్థ అయిన నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) తప్ప ప్రైవేటు కంపెనీలు ప్రవేశించలేదు. ఇప్పటివరకూ ఆర్సెలార్ మిత్తల్ తనకు అవసరమైన ఖనిజాన్ని ఎన్ఎండీసీ నుంచి తీసుకుని పైప్ లైన్ ద్వారా విశాఖపట్నం పంపుతుండేది. ఇప్పుడీ వేలంతో ఆ కంపెనీకి సొంత గనులు వచ్చాయి.

వీటిలో బైలదిల్లా 1ఎ, 1బి ఒక్కొక్కటీ 2,100 ఎకరాలు, 1సి 1,976 ఎకరాలు, హాహాలొద్ది 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ నాలుగు బ్లాకులతోనే దట్టమైన దండకారణ్యంలో దాదాపు ఏడు వేల ఎకరాల అడవి నేలమట్టమైపోయి 'అభివృద్ధి' జరగబోతున్నది. ఈ నాలుగు బ్లాకులూ కలిసి దాదాపు ముప్పై కోట్ల టన్నుల ఉత్తమశ్రేణి ఖనిజం తవ్వబోతున్నారు. ఇటువంటి లెక్కలలో తాము కాగితాల మీద పొందినదానికన్న ఎక్కువ విస్తీర్ణపు గనులు తవ్వి, మరింత ఎక్కువ ఖనిజాన్ని దోచుకుపోవడం అందరికీ తెలిసిందే. వేలం ప్రక్రియలో చెప్పిన మేరకే తవ్వుతారని అనుకున్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారమే ఈ నాలుగు గనుల ఖనిజం విలువ ఒక లక్షా ఇరవై వేల కోట్ల రూపాయలు. కాగా, ప్రభుత్వానికి దక్కే ఆదాయం ఇరవై వేల కోట్ల రూపాయలు మాత్రమే! ఈ రాష్ట్రంలో ఇంతకుముందే ఎన్ఎండీసీ, రాష్ట్ర ప్రభుత్వ ఛత్తీస్‌గఢ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సీఎండీసీ)తో కలిసి సంయుక్త సంస్థను ఏర్పరచి, గనులకు పర్యావరణ అనుమతులు సంపాదించి, ఆ గనులను తవ్వకం, ఖనిజాభివృద్ధి కార్యకలాపాలకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు ఇచ్చింది. ఖనిజ సంపన్నమైన ఈ రాష్ట్రంలో ఇప్పటికే అంబుజా, బిర్లా, ఎస్సార్, జిందాల్, జె కె లక్ష్మి, లఫార్జ్, ఎల్ అండ్ టి, వేదాంత వంటి కార్పొరేట్ దిగ్గజాలన్నీ ఉన్నాయి.

**ఇది పలు రకాల సమస్య**

ఇది ఆదివాసులకో, మావోయిస్టులకో సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఇది ముహూర్తాలు నిర్ణయించి మనుషులను చంపవచ్చునా అనే మానవతా సమస్య, నాగరికతా సమస్య. పర్యావరణ సమస్య, దేశ సంపద ఎవరికి చెందాలనే సమస్య, అటవీ హక్కుల చట్టం, పంచాయత్ రాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ చట్టం వంటి చట్టాల ఉల్లంఘన సమస్య. రాజ్యాంగ ఆదర్శాలు, ప్రజల హక్కులు అమలవుతున్నాయా అనే సమస్య. మనందరి సమస్య!

# వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి హైకోర్టులో షాక్

## మిథున్ అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు

అమరావతి ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసు  విచారణలో ఆడియో, వీడియో రికార్డు చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న ఎంపీ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. అయితే మద్యం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని న్యాయవాదుల సమక్షంలో విచారించాలని సిట్‌కు ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయవాదులు విచారణకు ఆటంకం కలిగించవద్దని స్పష్టీకరించింది. విచారణ సందర్భంగా అధికారులు చేయి చేసుకొని, దుర్భాషలాడే ప్రమాదం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్యాలయంలో ఉన్న సీసీటీవీలో కనిపించేలా విచారణ జరపాలని అధికారులకు సూచిస్తూ.. విచారణ సందర్భంగా ఆడియో, వీడియో రికార్డు చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న పిటిషనర్ అభ్యర్థనను హైకోర్టు రిజెక్ట్ చేసింది. కాగా.. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఎంపీ



మిథున్ రెడ్డిని శుక్రవారం ఉదయం విచారణకు హాజరుకావాలంటూ ఏపీ సిట్ బృందం ఇటీవల నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం 10 గంటలకు విజయవాడ సీపీ కార్యాలయంలోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. అయితే సిట్ నోటీసులపై తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందువల్ల తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మిథున్ రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఎంపీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీంలో ఎంపీకి ఊరట లభించింది. మిథున్ రెడ్డికి మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఆదేశాలిచ్చింది ఉన్నతన్యాయస్థానం. మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు ఇస్తూనే విచారణకు సహకరించాలని ఎంపీకి సుప్రీం కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు రేపు విచారణకు రావాల్సిందిగా మిథున్ రెడ్డికి ఏపీ సిట్ బృందం నోటీసులు జారీ చేసింది. న్యాయవాదుల సమక్షంలో విచారణ జరగాలని, కానీ విచారణకు న్యాయవాదులు ఆటంకం కలిగించవద్దని తాజా ఉత్తర్వుల్లో ఏపీ హైకోర్టు తేల్చిచెప్పింది. ఇక ఈ కేసులో సిట్ అధికారులు దర్యాప్తు చేయగా.. కీలక సమాచారాలను సేకరించారు. అందులో భాగంగా ఈ వ్యవహారం మొత్తం కసిరెడ్డి రాజశేఖర్ కనుసన్నుల్లోనే నడించిందని తేలింది. దీంతో కసిరెడ్డిని విచారించేందకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు సార్లు సిట్ నోటీసులు పంపించింది. కానీ కసిరెడ్డి మాత్రం విచారణకు డుమ్మా కొట్టారు. కసిరెడ్డి ఫోన్లు కూడా స్విచ్ఆఫ్ రావడంతో కుటుంబసభ్యులకు నోటీసులు జారీ చేశారు సిట్ అధికారులు. అలాగే ఈ కేసులో సాక్షిగా విచారణకు రావాల్సిందిగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి కూడా సిట్ నోటీసులు పంపించింది. దీంతో రేపు ఎంపీ మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డిలను సిట్ అధికారులు విచారించనున్నారు. వీరి విచారణతో మద్యం కుంభకోణానికి సంబంధించి ఇంకెన్ని విషయాలు బయటకు వస్తాయో చూడాలి మరి.

# పోక్సో కేసుల్లో 60శాతం మంది నిందితులు 18 ఏళ్లలోపు వాళ్లే: హోంమంత్రి అనిత

విశాఖపట్నం ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**ప్రేమ అనే ముసుగులో యువత బలైపోతున్నారని.. ఆవేశంలో చేసిన తప్పులకు జైలుపాలు అవుతున్నారని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. విశాఖలో 'మహిళా రక్షణకు కలసికట్టుగా' అనే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. పోక్సో కేసుల్లో 20 శాతం మంది నిందితులు 20 ఏళ్ల లోపు వాళ్లే ఉంటున్నారన్నారు. 18 ఏళ్లలోపు వాళ్లు 60 శాతం మంది ఉంటున్నారని చెప్పారు. అన్ని విద్యాలయాల్లో పోక్సో చట్టంపై అవగాహన**



**కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వీయ క్రమశిక్షణ ఒక సబ్జెక్ట్‌గా పాఠాల్లో చేర్చుతామని మంత్రి వివరించారు.**

"రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో 'మహిళా రక్షణకు కలసికట్టుగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. వంద సంవత్సరాల జీవితం కోసం యువత ఆలోచన చేయాలి. స్వీయ నియంత్రణ అందరూ అలవాటు చేసుకోవాలి. మన కోసం నిరంతరం కష్టపడుతున్న తల్లిదండ్రుల కోసం ఒక్క క్షణం ఆలోచించాలి. యువత భవిష్యత్తును గంజాయి నాశనం చేస్తుంది. యువత.. జీవితాలను ఇబ్బందుల పాలు చేసుకోవద్దు" అని అనిత సూచించారు.

## మే 2న అమరావతికి  రానున్న మోదీ

ఏర్పాటు చేయనున్నారు. ఈ వేదిక నుంచే పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మోదీ నిర్వహించనున్నారు. భద్రతా ఏర్పాట్లను ఎస్పీజీ బృందం పర్యవేక్షిస్తోంది. ప్రధాని పర్యటన ఏర్పాట్ల కోసం మంత్రుల కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల ప్రజలు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించారు. ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

## దక్షిణాది రాష్ట్రాల్లో.. 19 వరకు భారీ వర్షాలు

కొనసాగుతాయని అంచనా వేశారు. ఈ క్రమంలో వేడి, పొడి పరిస్థితులు కొనసాగుతాయని భావిస్తున్నారు. కొన్ని చోట్ల మేఘావృతమై ఉన్నప్పటికీ, ఏప్రిల్ 18 వరకు దేశ రాజధానిలో వేడి నుంచి పెద్దగా ఉపశమనం లభించదని ప్రకటించారు. ఏప్రిల్ 18, 19 తేదీల్లో జమ్మూ కశ్మీర్, లడఖ్, గిల్గిట్-బాల్టిస్తాన్, ముజఫరాబాద్, హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రదేశాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో వాతావరణం మారడం వల్ల ప్రజలు పలు రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో రోజంతా తేలికపాటి వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉంది. తూర్పు యూపీలోని లక్నో, వారణాసి, జౌన్‌పూర్, ప్రయాగ్‌రాజ్, ఘాజీపూర్, చందౌలి, మీర్జాపూర్ వంటి ప్రదేశాలలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ యూపీలో కూడా తేలికపాటి చినుకులు పడవచ్చని అంచనా వేశారు. ఈ వాతావరణ మార్పులు ప్రజల జీవనశైలిపై ప్రభావం చూపించవచ్చు. వేడి, వర్షాల మధ్య మార్పులు, వ్యవసాయ కార్యకలాపాలు, నీటి సరఫరా, ఆరోగ్య పరిస్థితులు, మరెన్నో అంశాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల, ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

## ఏపీలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ

గెజిట్‌ను న్యాయశాఖ జారీ చేసింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి ఉత్తర్వులు ఇచ్చారు.  ఇక, ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్ ప్రకారం 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించినట్లు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఇటీవల మీడియాకు తెలిపారు. గ్రూప్-1లోని 12 ఉపకులాలకు 1 శాతం, గ్రూప్-2లోని 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్-3లోని 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయనున్నట్లు ఆయన వివరించారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఫలాలు అన్ని ఉపకులాలకు సమానంగా అందేలా 200 పాయింట్ల రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

**గ్రూప్-1 (1% రిజర్వేషన్)**

ఈ గ్రూపులో రెల్లి కులంతో పాటు మొత్తం 12 ఉపకులాలు ఉన్నాయి. వీటికి కలిపి 1 శాతం రిజర్వేషన్‌ను కేటాయించారు.  ఈ గ్రూపులోని ఉపకులాలు: బవురి, చచాటి, చండాల, దండాసి, డొమ, ఘాసి, గొడగలి, మెహతర్, పాకీ, పామిడి, రెల్లి, సాప్రు.

**గ్రూప్-2 (6.5% రిజర్వేషన్**

మాదిగ కులంతో పాటు మొత్తం 18 ఉపకులాలను గ్రూప్-2గా వర్గీకరించారు. ఈ గ్రూపునకు 6.5 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. ఈ గ్రూపులోని ఉపకులాలు: అరుంధతీయ, బిందల, చమార్, చంభార్, దక్కల్, ధోర్, గొదారి, గోసంగి, జగ్గాలి, జంబువులు, కొలుపులవాండ్లు, మాదిగ, మాదిగ దాసు, మాంగ్, మాంగ్ గరోడి, మాతంగి, సమగార, సింధోలు.

**గ్రూప్-3 (7.5% రిజర్వేషన్)**

మాల కులంతో పాటు అత్యధికంగా 29 ఉపకులాలు ఈ గ్రూపులో ఉన్నాయి. గ్రూప్-3కి అత్యధికంగా 7.5 శాతం రిజర్వేషన్లు కేటాయించడం జరిగింది. ఈ గ్రూపులోని ఉపకులాలు: ఆది ద్రవిడ, అనముక్, అరయ మాల, అర్వ మాల, బారికి, బ్యాగర, చలవాది, ఎల్లమలవార్, హొలేయ, హొలేయ దాసరి, మదాసి కురువ, మహర్, మాల, మాల దాసరి, మాల దాసు, మాల హన్నాయి, మాలజంగం, మాల మస్తి, మాల సాలె, మాల సన్యాసి, మన్నే, మండల, సంబన్, యాతల, వల్లువన్, ఆది ఆంధ్ర, మస్తి, మిట్టా అయ్యలవార్, పంచమ.

## అమరావతిలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం..!

నిర్మాణానికి అయ్యే ఖర్చులో 60 శాతం బీసీసీఐ భరించనుంది. మిగతా మొత్తాన్ని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరపున ఏపీ ప్రభుత్వం భరించే అవకాశం ఉంది. మొత్తం వచ్చే ఏడాదికి లేదా 2027 వరకు అమరావతిలో అత్యాధునిక సౌకర్యాలతో ఓ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నిర్మించాలని ఏపీ ప్రభుత్వంతో పాటు బీసీసీఐ కూడా ఎంతో ఆసక్తి చూపిస్తోంది. అలాగే ఈ స్టేడియంలో ప్రతి ఏడాది కనీసం ఓ 10 అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించాలనే ప్రతిపాదనకు కూడా బీసీసీఐ అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే కొన్నేళ్లలో ఏపీకి ఒక ఐపీఎల్ టీమ్‌ను కూడా కేటాయించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో 10 టీమ్స్ పాల్గొంటున్నాయి. ఈ సంఖ్యను 12కు పెంచాలని కూడా బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం. ఆ రెండు కొత్త టీమ్స్‌లో ఏపీకి ఒక అవకాశం ఇస్తారని తెలుస్తోంది. ముందుగా అమరావతిలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నిర్మాణం జరిగిన తర్వాత.. మిగతా పనులు కూడా ఒక్కొక్కటిగా జరిగే అవకాశం ఉంది.

## భారత రాష్ట్రపతిని నిర్దేశించలేరు

రాష్ట్రపతి ఎంత కాలంలోపు నిర్ణయం తీసుకోవాలన్నది రాజ్యాంగంలో పేర్కొనలేదు. అంతమాత్రాన రాష్ట్రపతికి 'పాకెట్ వీటో' అధికారం ఉందని అనుకోరాదంటూ తీర్పు చెప్పింది. అయితే ఏదైనా ఒక బిల్లు విషయంలో రాజ్యాంగబద్ధతపై ప్రశ్నలు ఉత్పన్నమైనప్పుడు మాత్రం కార్యనిర్వాహక వ్యవస్థ కోర్టుల పాత్ర పోషించరాదని.. ఆర్టికల్ 143 ప్రకారం, దానిని సుప్రీంకోర్టుకు రిఫర్ చేయాలని చెప్పింది. కాగా, తమిళనాడు అసెంబ్లీలో పాస్ చేసి పంపిన 10 బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి పెండింగ్?లో పెట్టారు. దీనిపై డీఎంకే సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అసెంబ్లీ రెండోసారి పంపిన బిల్లులను గవర్నర్ ఆమోదించాల్సిందేనని తీర్పు వెల్లడించింది.

## యంగ్ గ్లోబల్ లీడర్‌గా రామ్మోహన్ నాయుడు

కోరుకొంటున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో యూరప్‌లోని దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ తదితరులు హాజరయ్యారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి పలువురు కేంద్రమంత్రులు సైతం వెళ్లారు. వారిలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉన్నారు. అయితే ఈ ప్రపంచ ఆర్థిక సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి.

## భూమల వివాదంపై 12 వారాలలో నివేదిక ఇవ్వాలని ఆదేశం

కొల్లేరులో ఉన్న వాస్తవ పరిస్థితులను నివేదిక ఇవ్వాలంటూ గత ఏడాది డిసెంబర్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ.. 2006 తర్వాత ఆక్రమణలూ తొలగించామని, తిరిగి ఆక్రమణలు చోటు చేసుకోవడంతో వాటిని తొలగించే పనిలో ఉన్నట్టుగా స్పష్టం చేసింది. ఇదే సమయంలో ౦5 కాంటూరు పరిధికంటే అదనంగా భూములు ధ్వంసం చేశారని, ప్రైవేటు, జిరాయితీ భూములకు పరిహారం చెల్లించకుండానే ధ్వంసం చేశారని భూ యజమానులు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఇంప్లీడ్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్‌గవాయి, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం నేడు విచారణ జరిపింది. కొల్లేరులో క్షేత్రస్థాయి పరిస్థితి ఏంటి?, ౦5 కాంటూర్ పరిధిలో జిరాయితీ భూములు ఉన్నాయా?, కొల్లేరును వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా ప్రకటించినప్పుడు దాని పరిధిలోకి వచ్చే ప్రైవేటు జిరాయితీ భూముల హక్కులను చట్టపరంగా నిర్ధారించారా? లేదా? అన్నదానిపై 12 వారాల్లోపు నివేదికఇవ్వాలని కేంద్ర సాధికార సంస్థకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ 12 వారాలకు వాయిదా వేసింది. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో కొల్లేరు గ్రామాల ప్రజలకు ఊరట లభించినట్లు అయింది. దశాబ్దాల కాలంగా తమ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు. కొల్లేరును వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా ప్రకటించినప్పుడు దాని పరిధిలోకి వచ్చే ప్రైవేటు జిరాయితీ భూముల హక్కులను చట్టపరంగా నిర్ధారించారా? లేదా? అనే విషయంపై లోతైన అధ్యయనం జరిగితే అక్కడ నష్టపోయిన జిరాయితీ భూముల సాగుదారులకు, ప్రైవేటు భూముల యజమానులకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్నారు.

## భారతి సిమెంట్స్ ఆస్తుల జప్తు

ఆస్తులను కూడా జప్తు చేసింది. పునీత్ దాల్మియాకు, విజయసాయి రెడ్డికి మధ్య డీల్ కుదిరిందన్న విషయాన్ని సీబీఐ చెప్పింది. ఫ్రాన్స్‌కు చెందిన పాసిఫామ్‌కు వాటాలో కొంత భాగాన్ని దాల్మియా అమ్మింది. వచ్చిన సొమ్ములో రూ.55 కోట్లు జగన్‌కు బదిలీ చేశారని సీబీఐ అభియోగాలను మోపింది. 2010 నుంచి 2011 మధ్య హవాలా ద్వారా లావాదేవీలు జరిగాయని సీబీఐ చార్జ్‌షీట్‌లో వెల్లడించింది. ఐటీ సోదాల్లో లభ్యమైన డీల్‌కు సంబందించిన వివరాలు, ఆధారాలు బయటపడ్డాయి. దీంతో రూ.793 కోట్ల ఆస్తులు జప్తు చేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది.

## ఉన్నత ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులకు
# ఏబీసీడీ అవార్డులు అందజేసిన ఏపీ డీజీపీ

- పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మికి ప్రథమ బహుమతి
- విజయనగరం, గుంటూరు ఎస్పీలకు ద్వితీయ, తృతీయ బహుమతులు
- డీజీపీ కార్యాలయంలో నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందజేసిన హరీష్ కుమార్ గుప్తా

అమరావతి ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

నేర పరిశోధన రంగంలో కేసుల సత్వర పరిష్కారానికి ఆధునిక విధానాలను అనుసరించి, వినూత్న మార్గాలను అన్వేషిస్తూ 'ఏబీసీడీ (అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్)'కు ఎంపికైన పోలీసు అధికారులను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అభినందించి సత్కరించారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్–డిసెంబర్ 2024 నాల్గవ త్రైమాసికానికి గాను ఉత్తమ ప్రతిభ కనబరిచి కేసుల పూర్వాపరాలను, వాటి పరిష్కారంలో వినియోగించిన సాంకేతిక పద్ధతులను, వినూత్న విధానాలను సి.ఐ.డి డీజీపీ శ్రీ రవిశంకర్ అయ్యన్నార్ పూర్తిగా పరిశీలించి నాలుగు ఉత్తమ కేసులను ఎంపిక చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి నేతృత్వంలోని బృందం ఆకివీడు మండల పరిధిలో జరిగిన హత్య కేసును చాకచక్యంగా ఛేదించినందుకు ఉత్తమ బహుమతిని అందుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ శ్రీమతి రత్న నేతృత్వంలోని బృందం గుడిబండ పరిధిలో ఒక వ్యక్తి తన శిశువును హత్య చేసి తప్పించుకుని కర్ణాటక రాష్ట్రంలో నకిలీ పేరుతో తిరుగుతుండగా పట్టుకున్నారు. అంతేకాకుండా పెండింగ్‌లో ఉన్న 26 సంవత్సరాల నాటి కేసును ఛేదించినందుకు గాను ద్వితీయ బహుమతిని అందజేశారు.

విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నేతృత్వంలోని బృందం విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సైబర్ క్రైమ్ (డిజిటల్ అరెస్ట్) కేసును ఛేదించి, ఐదుగురు నిందితులను అరెస్టు చేసింది. వారి వద్ద నుంచి రూ.10 లక్షల నగదు, రూ.9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు రికవరీ చేయడంతో పాటు, ఫిర్యాదుపై సకాలంలో స్పందించి నిందితుల బ్యాంకు ఖాతాల్లోని మరో రూ.22 లక్షలను ఫ్రీజ్ చేసి, డిజిటల్ అరెస్ట్ కేసును చాకచక్యంగా ఛేదించినందుకు తృతీయ బహుమతిని అందుకుంది. గుంటూరు జిల్లా ఎస్పీ యస్. సతీష్ కుమార్ నేతృత్వంలోని బృందం చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలిక హత్య కేసును చాకచక్యంగా ఛేదించినందుకు కన్సోలేషన్ బహుమతిని అందుకుంది. ఏబీసీడీ అవార్డుల ప్రదానంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానం పొందిన కేసుకు లక్ష రూపాయల నగదు బహుమతి, రెండవ స్థానం పొందిన కేసుకు రూ.60 వేలు, మూడవ స్థానం పొందిన కేసుకు రూ.40 వేలు మరియు కన్సోలేషన్ బహుమతి పొందిన కేసుకు రూ.20 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ సిబ్బంది అందరూ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.




## సుప్రీంకోర్టు వెసులుబాటు కల్పించడం..
# శుభ పరిణామం

**కొల్లేరు సమస్య పరిష్కారానికి మొదటి అడుగు పడింది. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి.**

ఏలూరు, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కొల్లేరు ప్రాంత ప్రజల వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు మూడు నెలలు వెసులుబాటు కల్పించడం శుభ పరిణామం అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి మొదటి అడుగు పడిందని ఎంపీ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాల మార్గదర్శకత్వంలో తనతో పాటు కైకలూరు, దెందులూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి చేసిన కృషి ఫలించిందని ఎంపీ స్పష్టం చేశారు. కొల్లేరు సరిహద్దులు నిర్ణయించాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అధికారులు చేపట్టిన చర్యలతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురికావలసిన పరిస్థితిని ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, తాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసి వివరించడం జరిగిందని ఎంపీ తెలిపారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ వచ్చారని ఎంపీ వెల్లడించారు. కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన భరోసా మేరకు సుప్రీంకోర్టు ఆశ్రయించడం జరిగిందని ఎంపీ తెలిపారు. కొల్లేరు ప్రజల వాదనలు వినేందుకు సుప్రీంకోర్టు సానుకూలత వ్యక్తం చేస్తూ మూడు వారాల గడువు ఇవ్వడం ఊరట లభించిందని ఎంపీ పేర్కొన్నారు. సమగ్ర వివరాలతో జిల్లా కలెక్టర్ నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో సమర్పిస్తారని ఎంపీ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్డీఏ ప్రభుత్వాలు కొల్లేరు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తున్నాయని ఎంపీ మహేష్ కుమార్ స్పష్టం చేశారు.



# శివశ్రీకి సభా సామ్రాట్ బిరుదుతో ఉగాదిపురస్కారం

ఏలూరు, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విశ్వకర్మ ఆర్క్ ఫౌండేషన్ హైదరాబాద్ వారిఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రధానసంచాలకులు,సీనియర్ జర్నలిస్టు అప్పలభక్తుల శివకేశవరావు (శివ శ్రీ)కి, సభా సామ్రాట్ బిరుదుతో ఉగాదిపురస్కారమిచ్చి సత్కరించారు. ఆంధ్ర, తెలంగాణ,తమిళనాడు, రాష్ట్రాలలో విభిన్న రంగాలలో నిష్ణాతులైన వారిని పురస్కారాలకు ఎంపికచేశారు.

ఇదేక్రమంలో సభలుసమావేశాలునిర్వహణలో సందర్భోచితంగా వాక్చాతుర్యం ప్రదర్శించడం తద్వారా సమాజానికి ప్రయోజనం కలిగేలా ప్రతిపాదనలు చెయ్యడం వంటి అంశాల ఆధారంగా శివ శ్రీ కి సభా సామ్రాట్ బిరుదు,పురస్కారానికి ఎంపికచేశారు.సోమవారం రాత్రి హైదరాబాద్ లో ప్రముఖుల సమక్షంలో ఈపురస్కారాన్ని అందించారు. ఈసందర్భంగా తనను ఈ పురస్కారాన్ని అందించిన విశ్వకర్మ ఆర్క్ ఫౌండేషన్ వార్కి. సోషల్ మీడియా ద్వారా అభినందనలు తెలిపిన ఆత్మీయులకు శివశ్రీ ధన్యవాదాలు తెలిపారు. ఈపురస్కారంసమాజంపట్ల తనకు బాధ్యతను పెంచిందని,సమాజశ్రేయస్సుకోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని శివశ్రీ తెలిపారు.కాగా ఈకార్యక్రమానికి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వరిజిస్టార్ త్రిమూర్తుల గౌరీశంకర్ అధ్యక్షతవహించగా సంస్థ నిర్వాహకులు కె.కిరణ్ కుమార్ (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ తెలంగాణ రాష్ట్రం)వెనోస్ట్రస్ట్ అధినేత బంగారు తాతారావు,తదితరులు నిర్వహించారు.శివశ్రీ తోపాటు . వైద్యరంగం , పారిశ్రామిక రంగం,సేవారంగం,శిల్పకళా,వేదపరిశోధన, సైంటిస్ట్ విభాగం, సాహిత్య విభాగం,సంగీతం విభాగాల్లో నిష్ణాతులకు ఈపురస్కారాలిచ్చి సత్కరించారు.



## మార్పు మంచిదే...
# ఆత్మనే మార్చకూడదు కదా!



**'డూన్' స్కూల్‌లో బాలబాలికలు కలిసి చదువుకోవడాన్ని (కో-ఎడ్యుకే షన్) ప్రవేశపెట్టాలా? ఇది కొత్త ప్రశ్నేం కాదు. 2010లో చివరిసారి దీనిపై చర్చ జరిగింది. అప్పటి రాష్ట్ర పతి ప్రతిభా పాటిల్ స్కూల్ 75వ ఫౌండర్స్ డే కార్యక్రమంలో ఈ అంశం ప్రస్తావించారు. ఆమె ప్రతిపా దన విని మగపిల్లలు ముసిముసిగా నవ్వుకున్నారు. ఈ ఆలోచన వారి గుండెల్లో వెచ్చదనం నింపి వుంటుంది. పెద్దవారికి మాత్రం ఇదేం రుచించలేదు. కేవలం మగపిల్లల కోసం నెలకొల్పిన డూన్ స్కూల్ ఇండియాలోనే ప్రతిష్ఠాత్మక ఆశ్రమ పాఠశాల (బోర్డింగ్ స్కూలు) అని యాజమాన్యం భావిస్తుంది.**

సమాజంలో లింగ సమానత్వం ఉండాలన్న భావనతో ప్రతిభా పాటిల్ ఈ వ్యాఖ్య చేసి ఉంటారని ఆహూతులు భావించారు. 'వెల్హామ్ గరల్స్' లేదా 'మహారాణి గాయత్రీ దేవి' లేదా ఇండియాలో ఉన్న అనేక 'లొరాటో కాన్వెంట్స్' స్కూళ్లు 'గరల్స్ ఓన్లీ (బాలికల) పాఠశాలలుగానే కొనసాగు తున్నాయి. అందుకు లేని అభ్యంతరం డూన్ స్కూల్ విషయంలో ఎందుకు? తొలుత ఎలా ప్రారంభమయ్యాయో అలాగే కొనసాగే హక్కు స్కూళ్లకు ఉండాలి. ఇది కో–ఎడ్యుకేషన్‌కు వ్యతిరేక వాదన అని పొరబడకండి. స్కూళ్ల హక్కుకు సంబంధించిన సమర్థన మాత్రమే. వాస్తవానికి, మనకు కో–ఎడ్యుకేషన్ విద్యాసంస్థలు ఉండి తీరాల్సిందే. ఇందులో ఎలాంటి సందే హం లేదు. అదే విధంగా, కేవలం బాలురకు, అలాగే కేవలం బాలికలకు మాత్రమే ఉద్దేశించిన పాఠశాలలూ ఉండాలి. 15 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ప్రశ్న మీద చర్చ మొదలైంది. 2010లో మాదిరిగా ఏదో యథాలాపంగా కాకుండా, ఈఅంశం మీద ఇప్పుడు పకడ్బందీగా చర్చ జరుగుతోంది. ప్రపంచం మారుతోంది. సమతుల్యం, సమ్మిళితం, వైవిధ్యం... వీటితో కూడిన విద్యాభ్యాస వాతావరణాన్ని కో– ఎడ్యుకేషన్ అందిస్తుంది. బాయ్స్ ఓన్లీ స్కూళ్లలో సాంప్ర దాయిక పురుషత్వ భావనలతో కూడిన వాతావరణం నెలకొని ఉంటుంది. సహవిద్యే దీనికి విరుగుడు. పరస్పరం ఎలా గౌరవించుకోవాలో, ఒకరి నుంచి మరొకరు ఎలా నేర్చు కోవాలో బాల బాలికలు ఉభయులకూ కో–ఎడ్యుకేషన్ వ్యవస్థ నేర్పిస్తుంది. ఇదీ ప్రస్తుతం డూన్ స్కూల్ సహవిద్యకు అనుకూలంగా సాగుతున్న వాదన. వీరు లేవనెత్తుతున్న ఈ అంశాలతో ఎలాంటి పేచీ లేదు. ఇవి మంచి వాదనలు. అయితే, వీటిని తోసిపుచ్చేందుకూ ఇంతే బలమైన, ముఖ్య మైన ఇతర కారణాలు ఉన్నాయి. డూన్ స్కూల్‌కు ఒక గుర్తింపు ఉంది. అది దాదాపువందేళ్ల పురాతనమైంది. ఎవరెన్ని చెప్పినా, సంప్రదాయం ముఖ్యమైంది. 'మారుతున్న కాలంతో పాటు మనమూ మారాలి' అంటూ సంప్రదాయాన్ని గాలికి వదిలేయ కూడదు. సహవిద్యా విధానం అనేది డూన్ స్కూల్ అస్తిత్వాన్నీ, వ్యవస్థాపకుడి ఆశయాన్నీ మౌలికంగా మార్చివేస్తుంది. కాబట్టే, ఇంగ్లండులో అనేక వందల ఏళ్ల సుప్రసిద్ధ చరిత్ర కలిగిన ఈటన్ కాలేజీ, హ్యారో పాఠశాలలు మారలేదు.

స్కూల్ సంస్కృతినీ ఈ సందర్భంగా మనం పరిగణన లోకి తీసుకోవాలి. దాదాపు శతాబ్ద కాలం నుంచీ డూన్ కొన్ని విలువల ప్రాతిపదికగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. అక్కడ విద్యార్థుల ఆలనాపాలనబీ గురువులతో, పాత విద్యార్థులతో విద్యార్థుల స్నేహపూర్వక సాన్నిహిత్యం ఎన్నదగినవి. కో–ఎడ్యుకేషన్ అయినా, కాకున్నా కొన్ని ఇతర ప్రముఖ పాఠశా లలకూ ఇలాంటి ఔన్నత్యం ఉంటుంది. కాదనడం లేదు.

మరో ముఖ్యమైన వాస్తవం ఏమిటంటే, కో–ఎడ్యుకేషన్ విద్యాసంస్థగా అవతరించడానికీ, అందుకు అవసరమైన వస తులు కల్పించడానికీ, ఇతర మార్పులు చేయడానికీ డూన్ క్యాంపస్ ఎంతమాత్రం సరిపోదు. అయినా సరే బాలికలకు ప్రవేశం కల్పించాలీ అంటే బాలుర సంఖ్యను కుదించాల్సి వస్తుంది. నిజంగా ఇది అవసరమా? మేయో కాలేజీని సహవిద్యాభ్యాస సంస్థగా మార్చక పోవడానికి బహుశా ఇదే కారణమై ఉంటుంది. బదులుగా, 'మేయో గరల్స్ స్కూల్'ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. డూన్ స్కూలుకు కూడా ఈ అవకాశం ఉంది. నిజానికి, ఇలా చేయడం మరింత అర్థవంతంగా ఉంటుంది.

డూన్ స్కూల్ విషయంలో ఈ చర్చ కంటే ముఖ్యమైంది... స్కూలు పనితీరు విద్యాపరంగా మెరుగుపడాలి. క్రీడా సదుపాయాలు పెరగాలి. అలాగే ఇతర మౌలిక సదు పాయాలు పెంచాలి. ఇవన్నీ సమకూర్చుకోవడమే స్కూలు ప్రథమ ప్రాధాన్యం! కో–ఎడ్యుకేషన్ కాదు!!డాస్కోస్ (డూన్ స్కూల్ బాయ్స్ తమకు తాము పెట్టుకున్న పేరు)కు అమ్మాయిల ప్రపంచం పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీన్ని ఎవరూ కాదనరు. దగ్గర్లోనే ఉన్న వెల్హామ్ వంటి గరల్స్ స్కూల్స్‌తో డూన్ భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. వెల్హామ్‌లో డాస్కోస్ అక్కలు, చెల్లెళ్లు, కజిన్స్ చాలామంది చదువుతుంటారు. ఉభయులూ కలిసి అనేక విద్యా, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి చేపట్టడం సాధ్యమే. కో–ఎడ్యుకేషన్ కంటే ఇది సరైనది. అర్థవంతంగానూ ఉంటుంది.

మార్పు అనేది ఇతర సంస్థలకే పరిమితం కాదు. డూన్ స్కూల్ కూడా ఎప్పటికప్పుడు మార్పును అందిపుచ్చు కోవాలి. అంటే దాని మౌలిక స్వరూపమే మారాలని కాదు. మార్పును స్వాగతించడం నిర్మాణాత్మకమైనది. పరిపూర్ణత్వం కోసం పొరపాటు లక్ష్యాన్ని నిర్ణయించి, ఏదో మంచి జరుగు తుందనే నమ్మకంతో అసలు ఆత్మనే మార్చాలనుకోవడం విధ్వంసాత్మకం. అమూల్యమైన, గౌరవనీయమైన ఒక బాయ్స్ స్కూల్‌గా కొనసాగే హక్కును డూన్ స్కూల్ ఇప్పటికే సాధించింది. అలా కొనసాగనిద్దాం.

# రామచంద్రపురంలో చంద్రన్న ఉద్యోగ భవన్

**రాష్ట్రంలోనే తొలిసారిగా ఏప్రిల్ 20న ఏర్పాటు - నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా**
**సీఎం చంద్రబాబు కలల సాకారం దిశగా మంత్రి వాసంశెట్టి సుభాష్**

రాజమహేంద్రవరం ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలల సాకారం నిరుద్యోగ నిర్మూలన దిశగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నూతన కార్యక్రమానికి రాష్ట్రంలో తొలిసారిగా శ్రీకారం చుట్టారు.తన నియోజకవర్గం రామచంద్రపురంలో చంద్రన్న ఉద్యోగ భవన్ కార్యాలయాన్ని ఈనెల 20న ప్రారంభించి నిరుద్యోగులకు తక్షణం ఉద్యోగ అవకాశం కల్పించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.సుమారు 300 కంపెనీలతో అవగాహన ఒప్పందం చేసుకుని పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించే దిశగా రాష్ట్రంలోనే తొలిసారిగా చంద్రన్న ఉద్యోగ భవన్ ఏర్పాటు చేసినట్టు మీడియాకు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ నిరుద్యోగాన్ని రూపుమాపే ఉన్నత ఆశయంతో,సీఎం చంద్రబాబు ఆశయానికి అనుగుణంగా,ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన రామచంద్రపురం నియోజవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.చదువుకుని ఉపాధి అవకాశాలు లేనివారికి ఉపాధి కల్పించడమే ఈ చంద్రన్న ఉద్యోగ భవన్ కర్తవ్యం అన్నారు. ఈ చంద్రన్న ఉద్యోగ భవన్ నిరంతరం అందుబాటులో ఉండి పనిచేస్తుందన్నారు. నిరుద్యోగులు నేరుగా తమ వివరాలతో ఉద్యోగ భవన్ కు వెళ్లి ఉపాధి అవకాశం పొందవచ్చు అన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రానికి సుమారు 8 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, వీటి ద్వారా సుమారు మూడు లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తుంది అన్నారు.అలాగే చిన్న, సూక్ష్మ,మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు ఎం.ఎస్.ఎం.ఈ ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగులు లేని నియోజకవర్గంగా రామచంద్రపురంను తీర్చిదిద్దాలనే ముఖ్య ఆశయంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ స్థాపించి ఇప్పటికే పలు జాబ్ మేళాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు మంత్రి సుభాష్ ఈ సందర్భంగా వెల్లడించారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
శుక్రవారం18 ఏప్రిల్ 2025



## ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ లో ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు

**అభినందించిన ఎమ్మెల్యే సత్యానందరావు.**

రావులపాలెం, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్ఫ్ ఒలింపియాడ్ లో విజేతలుగా నిలిచిన రావులపాలెం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. ఇటీవల జరిగిన ఈ పరీక్షలలో గ్రాండ్ ప్రైజ్ గా ల్యాప్ టాప్ గెలుచుకున్న సజ్జా హర్షద్ ను, మొదటి బహుమతిగా టాబ్ ను అందుకున్న నంబు వి వి సాయి రిత్విక్ ను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఎమ్మెల్యే సత్యానందరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇంచార్జ్ నరేష్, రావులపాలెం ప్రిన్సిపాల్ జగదీష్, కొత్తపేట ప్రిన్సిపాల్ జి శివరాం, డీన్ కె ప్రసాద్, వై ఎస్ ఎన్ మూర్తి, ఏవో రాజు, (ఐ న్ టి స్ ఓ) ఇన్చార్జ ప్రభాకర్, ఇన్చార్జెస్ కుమారి, రాజేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి విద్య కోర్సుల విద్యార్థులకు మంచి భవిష్యత్తు.



రావులపాలెం, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వృత్తి విద్య కోర్సులు పట్ల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని నరేంద్రపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి వేణు ఒక ప్రకటనలు తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ కోర్సు లో భాగంగా ఎలక్ట్రానిక్, అగ్రికల్చరల్ ట్రేడ్లో ఇంటర్ షిప్ ప్రోగ్రాం లో భాగంగా విద్యార్థులను ఫీల్డు ప్రాక్టికల్ నాలెడ్జ్ కొరకు జిల్లాలోని వివిధ వ్యవసాయ క్షేత్రాలను, గోడౌన్ లను, ఎలక్ట్రానిక్స్ సంబంధించిన వివిధ ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు తీసుకువెళ్లి అక్కడ జరుగుతున్న పనులన్నీ పరిశీలించి కూలంకశంగా క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి సి డి ఓ ఎంఏకే భీమారావు జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ కె రమేష్, వోకేషనల్ ట్రైనర్స్ డి త్రినాథ్, ఆర్ లక్ష్మీజ్యోతి విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు




రావులపాలెం, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం ప్రతి బుధవారం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేయాలని సదుద్దేశంతో ఈరోజు రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో కార్యకర్తలు యొక్క సమస్యలను, పలు అంశాలు గూర్చి చర్చించడం జరిగింది. నాయకులు కార్యకర్తలు సమన్వయంగా ఉండాలని, నేను కార్యకర్తతో సమానమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి,మేడపాటి కాసురెడ్డి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన

**- స్థపతి డిప్యూటీ కమిషనర్ పర్యటన**

ఆత్రేయపురం, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం స్థపతి డిప్యూటీ కమిషనర్ పి.పరమేశప్ప పరిశీలించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావుతో కలిసి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న వివిధ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ ముఖద్వార నిర్మాణం చేసేందుకు అనువైన ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన కోనేరు నిర్మాణం, భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న టాయిలెట్స్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగమ సలహాదారు ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు, డిఈ శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# సబ్సిడీ రుణాలకు సిబిల్ స్కోర్ అడ్డంకి

**బ్యాంకుల తీరు పేదలపై భారం.**

**-కార్పొరేషన్ రుణాలకు స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం.**

**-తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొక్కా ప్రసాద్**

కొత్తపేట ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ప్రభుత్వం ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలు పేద, మధ్యతరగతి నిరుద్యోగ యువతకు ఉపశమనం కలిగించే ఒక మార్గంగా మారాయి. కానీ, ఈ రుణాలను బ్యాంకులు సిబిల్ స్కోర్ నెపంతో తిరస్కరిస్తున్న పరిస్థితి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను తీవ్రంగా నిరాశకు గురిచేస్తోంది. రుణానికి అర్హత ఉన్నవారు సైతం బ్యాంకుల వద్ద నిరాకరణకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో బ్యాంకు ఉద్యోగుల వైఖరి హేళనగా ఉండడం, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై వివక్షత చూపడం కూడా బాధాకరం. ఇది కేవలం ఆర్థిక అంశమే కాదు, సామాజిక న్యాయాన్ని దెబ్బతీసే విధంగా మారుతోంది. కొంత మంది కార్పొరేషన్ ఋణాలు అంటే భయపడే విధంగా మారింది.దేవుడు వరం ఇచ్చిన పూజారి వరం ఇవ్వలేదు అనే చందంగా మారింది. ఒకవైపు నిరుద్యోగం, మరోవైపు కుటుంబ ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న యువతకు కార్పొరేషన్ రుణాలు కొంతమేర ఉపశమనం కలిగించగలవు. కానీ బ్యాంకుల నిరాకరణలతో నిజంగా లబ్ధి పొందేవారు గణనీయంగా తక్కువగా ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పథకాలు ఎప్పుడైతే గ్రౌండ్ లెవెల్లో అందుతాయో అప్పుడే ప్రజలకు నిజమైన ప్రయోజనం ఉంటుంది. గత వైసిపి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లు విభజించింది తప్ప ఏ కార్పొరేషన్ కి రూపాయి కేటాయించ కుండా కార్పొరేషన్లకు అన్యాయం చేసింది. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, కార్పొరేషన్లకు విడుదల అయిన నిధులు స్వల్పంగా ఉన్నప్పటికీ, ఉన్నవాటిని సమర్థంగా వినియోగించుకునే విధంగా బ్యాంకులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం అత్యవసరం. ముఖ్యంగా సబ్సిడీ రుణాలకు సిబిల్ స్కోర్ మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కొత్తపేట నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొక్కా ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు.

## సెర్ప్ ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**- అభినందించిన ఎమ్మెల్యే సత్యానందరావు**



కొత్తపేట ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్ఫ్ ఒలింపియాడ్ లో రావులపాలెం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల జరిగిన ఈ పరీక్షలలో గ్రాండ్ ప్రైజ్ గా సజ్జా హర్షద్ ల్యాప్ టాప్ గెలుచుకోగా, నంబు వి.వి.సాయి రిత్విక్ మొదటి బహుమతిగా ట్యాబ్ అందుకున్నాడు. ఈ సందర్భంగా కొత్తపేట మండలం వాడపాలెంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వారిని దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇంచార్జ్ నరేష్, ప్రిన్సిపాల్ జగదీష్, జి.శివరాం, కె.ప్రసాద్, వై.ఎస్.ఎన్ మూర్తి, రాజు, ప్రభాకర్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అండ : ఎమ్మెల్యే సత్యానందరావు



రావులపాలెం ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

క్రమశిక్షణ గల కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అండ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి బుధవారం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో కార్యకర్తల సమస్యలను తెలుసుకోవడంతో పాటు పలు అంశాలు గూర్చి చర్చించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా ఉండాలని, తాను కూడా ఒక కార్యకర్తనే అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి, మేడపాటి కాసురెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆకాశమే హద్దుగా తుమ్మలపల్లిలో అంబేద్కర్ జయంతి వేడుకలు...**

# పేదలకు దుస్తులు పంపిణీ...

అల్లవరం, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తుమ్మలపల్లి గ్రామంలో అంబేద్కర్ 134 వ జయంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత డాక్టర్ పరమట నరసింహామూర్తి, రాజేశ్వరి దంపతులు అంబేద్కర్ నినాదం " పే బ్యాక్ టూ థి సోసిటీ " సంపాదించిన దానిలో సొంత గ్రామానికి సేవాదృక్పథంతో ఏదోచేయాలనే ఉద్దేశ్యంతో ఆ దంపతులు కుమారుడు పరమట






సారధి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహణకు శ్రీకారం చుట్టారు. సుమారు 200 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి, సరెళ్ల వెంకటరత్నం పాల్గొన్నారు. వక్తలుగా అయితాబత్తుల రామేశ్వరావు, పిల్లి జైభీంరావ్, డాక్టర్ కాశి రామారావు,పరమట వీరాస్వామి,పరమట రామారావు, బడుగు



సాయిబాబు పాల్గొన్నారు. అతిధిలుగా స్థానిక తుమ్మలపల్లి సర్పంచ్ వడ్డి సుభాషిణి, ఎం.పి.టి.సి పులుసుగంటి రాజేశ్వరి రాజోలు ఎం. పి టి. సి. మట్టా శైలజా హయారయ్యారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత పరమట నరసింహామూర్తి వహించగా కాట్రూ శాంతి కిరణ్ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో పని చేస్తున్న, పదవి విరమణ పొందిన వారికీ ఘనంగా సన్మానం నిర్వహించారు. సుమారు 200 మంది పేదలకు వస్త్ర పంపిణీ చేసి, గ్రామంలో గల వివిధ అంబేద్కర్ యువజన సంఘాలు ఐక్య వేదిక గా ఏర్పడి డాక్టర్ పరమట నరసింహామూర్తి ఆర్థిక సహాయంతో గ్రామంలో అర్హులు అయిన పేదలు అయిన వృద్ధులకు,మహిళలకు, పురుషులకు, దివ్యంగులకు, వితంతువులకు వస్త్ర బహుకరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. గ్రామంలో భాగమైన మర్రి చెరువు, కెనాల్ సెంటర్, టీనేజ్ ఫ్రైండ్ సర్కిల్, ఇటుకులగుంట, తాళ్లచెరువు, వెంకన్న చెరువు, తుమ్మల్లో, మెయిన్ రోడ్ సెంటర్, పిల్లకాలువ తదితర ప్రాంతాల ప్రజలను అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇంజనీర్ వడ్డి వెంకటేశ్వరరావు, ఊళ్లూరి గంగాధర్, పులుసుగంటి గంగాధర్, మోకా సతీష్, గుర్రం అశోక్, రాపాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వా రైతుల జిల్లా అధ్యక్షులుగా దెందుకూరి సత్తిబాబు రాజు

**ఆక్వా రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా...**



అల్లవరం, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆక్వా అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా దెందుకూరి సత్యనారాయణరాజు (సత్తిబాబు రాజు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమలాపురం క్షత్రియ పరిషత్ అసోసియేషన్ హాలులో జరిగిన ఆక్వా రైతుల సమావేశానికి సీనియర్ ఆక్వా రైతు మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఆక్వా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అల్లవరం చెందిన దెందుకూరి సత్యనారాయణ రాజు (సత్తిబాబు రాజు) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని సీనియర్ రైతు నాయకులు త్సవటపల్లి నాగభూషణం, యాళ్ళ వెంకటానందం, దాట్ల పృథ్వీవర్మ, సయ్యపరాజు సత్తిబాబు రాజు బలపరిచారు. సభ్యులంతా హర్షధ్వానాల మధ్య సత్తిబాబు రాజు ఎన్నికకు మద్దతు తెలిపారు. సత్తిబాబు రాజు మాట్లాడుతూ ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తోలేటి నానాజీ, మానే శ్రీను, మేడిద శంకర్, సత్తి శ్రీను బాబు, గవర, దొరబాబు, గుత్తుల ధర్మరాజు, త్సవటపల్లి మణి కుమార్, మోటూరి నానీ, సూదా శ్రీను, నంద్యాల శివాజీ, కాయల బలరాం తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
ఏప్రిల్ 18,
శుక్రవారం 2025



## ఆ బెంగాల్ టీచర్లు కొంతకాలం
# ఉద్యోగాల్లో కొనసాగొచ్చు: సుప్రీంకోర్టు




**దిల్లీ: పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న 25,753 మంది టీచర్లు, ఇతర సిబ్బంది నియామకం చెల్లుబాటు కాదంటూ ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. అయితే ఈ వ్యవహారంలో కొందరు టీచర్లకు స్వల్ప ఊరట లభించింది. నియామక ప్రక్రియ ద్వారా ఎంపికై, ఎలాంటి ఆరోపణలు లేని, 9-12 తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను కొనసాగించడానికి అనుమతించింది. కొత్త నియామక ప్రక్రియ పూర్తయ్యేవరకు వారు బోధన కొనసాగించొచ్చని చెప్పింది. విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది.**

అలాగే బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు ఒక డెడ్‌లైన్ విధించింది. మే 31లోగా కొత్త రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం ప్రకటన ఇవ్వాలని ఆదేశించింది. అలాగే ఎంపిక ప్రక్రియ డిసెంబర్ 31లోగా పూర్తికావాలని స్పష్టంచేసింది. "దీనికి సంబంధించి మే 31లోగా రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశాలు జారీ చేశారు. ఇక ఈ స్వల్ప ఊరట గ్రూప్-సి, గ్రూప్-డి ఉద్యోగులకు వర్తించదు.

టీచర్ల నియమకాన్ని రద్దు చేస్తూ ఈనెల ప్రారంభంలో సుప్రీం తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీరి నియామక ప్రక్రియ యావత్తూ అక్రమాలతో కూడుకొని ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. టీచర్లు, ఇతర సిబ్బంది నియామకాన్ని రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు గత సంవత్సరం ఏప్రిల్‌లో వెలువరించిన తీర్పును సుప్రీం ధర్మాసనం సమర్థించింది. ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లు, సిబ్బంది ఇప్పటివరకూ తాము పొందిన జీతభత్యాలను తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది.

మానవీయ కారణాలరీత్యా కొందరు దివ్యాంగులకు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ తీర్పు నుంచి మినహాయింపు ఇచ్చి వారు ఉద్యోగంలోనే ఉంటారని స్పష్టంచేసింది. వివాదాస్పదంగా మారిన ఈ నియామకాలు 2016లోనే జరిగాయి. అయితే సుప్రీం ఆదేశాలతో పలు పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడింది. విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతుందంటూ బెంగాల్ ప్రభుత్వం పిటిషన్ వేసిన నేపథ్యంలో ఈ తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

## తైవాన్‌కు అత్యంత సమీపంలో
# చైనా జలాంతర్గాములు..!




చైనా దాడిని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్న తైవాన్..


**తైవాన్ : తైవాన్‌కు అత్యంత సమీపంలో చైనాకు చెందిన శక్తిమంతమైన జలాంతర్గాముల కదలికలు పెరిగాయి. తాజాగా గూగుల్ మ్యాప్స్‌లో ఈవిషయం వెల్లడైంది. తైవాన్ సమీపంలోని చైనా నౌకాదళ స్థావరమైన క్వింగ్‌డావ్‌లో కనీసం ఆరు శక్తిమంతమైన జలాంతర్గాములు దర్శనమిచ్చాయి. ఎల్లోసీలో ఉన్న దీనిని చైనా తొలి సబ్‌మెరైన్ బేస్‌గా వ్యవహరిస్తారు. ఈ చిత్రాలను ఆస్ట్రేలియాకు చెందిన నావికదళ నిపుణుడు అలెక్స్ లక్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.**

జపాన్ సముద్రం, తూర్పు చైనా సముద్రజలాల్లోకి అత్యంత వేగంగా జలాంతర్గాములు ప్రవేశించేందుకు క్వింగ్‌డావ్ స్థావరం అనుకూలం. ఇక్కడ రెండు టైప్ 091, 093ఏ జలాంతర్గాములు నిలుపగా.. మరో గుర్తుతెలియని సబ్‌మెరైన్ కూడా ఉంది. ప్రస్తుతం దానిని విచ్ఛిన్నం చేస్తుండి ఉంటారని పేర్కొన్నారు. ఇక అదే చిత్రంలో టైప్092 జలాంతర్గామి కూడా కనిపిస్తోంది. దీని స్థానాన్ని సరికొత్త టైప్ 094తో భర్తీ చేయనున్నారు.

బీజింగ్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ తైవాన్ వార్షిక హన్‌కుయాంగ్ యుద్ధ విన్యాసాలు మొదలుపెట్టింది. ఇవి 14 రోజులపాటు జరగనున్నాయి. 2027లో చైనా ఆక్రమిస్తుందనే అంచనాలను దృష్టిలోపెట్టుకొని వీటిని నిర్వహిస్తున్నట్లు తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ పేర్కొన్నారు. ఈ విన్యాసాల్లో తైవాన్ ఎం1ఏ2టీ ట్యాంక్‌లను, హిమార్స్ రాకెట్ వ్యవస్థ, యాంటీషిప్ మిసైల్ వ్యవస్థలను పరీక్షించడంతోపాటు లైవ్ ఫైర్‌డ్రిల్స్ కూడా నిర్వహించనుంది.

ఇటీవల తైవాన్ సమీపంలో రెండ్రోజుల పాటు చైనా యుద్ధ విన్యాసాలను నిర్వహించింది. ఈసందర్భంగా తైవాన్‌లోకి చైనా ట్యాంకులు వెళ్లడాన్ని సాధన చేసేలా పెద్ద తేలియాడే వంతెనను నిర్మించారు. గతంలో చైనా దళాలు తైవాన్‌లో అడుగుపెట్టడంపై నిపుణుల్లో సందేహాలుండేవి. కానీ, సరికొత్త వంతెన వ్యవస్థ కారణంగా ఇప్పుడు అవి తేలిగ్గా ఆ ద్వీప దేశంలోకి అడుగుపెట్టగలవని చెబుతున్నారు.

# ట్రంప్ విధానాలు మమ్మల్ని ముంచేశాయి: ఫెడ్ ఛైర్మన్ ఆగ్రహం



**చికాగో: భారత్, చైనా సహా పలు దేశాలపై భారీ స్థాయిలో సుంకాలతో ప్రపంచ వాణిజ్య యుద్ధానికి తెర లేపారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. దీనివల్ల అగ్రరాజ్య కంపెనీలు, పరిశ్రమలపైనా పెను ప్రభావం పడనుండటంతో ఆయన ఆర్థిక విధానాలపై స్వదేశంలోనూ పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ కూడా విమర్శలు గుప్పించారు. సుంకాల పెంపుతో ద్రవ్యోల్బణం తీవ్రస్థాయికి చేరుకుంటుందన్నారు. ట్రంప్ పాలనలో విధానపరమైన మార్పులు ఫెడరల్ రిజర్వ్ సిస్టమ్ (అమెరికా కేంద్రబ్యాంకు)ను ముంచేశాయని దుయ్యబట్టారు.**

చికాగోలో జరిగిన ఓ కార్యక్రమంలో పావెల్ మాట్లాడుతూ.. "ట్రంప్ సర్కారు నిర్ణయాలు చాలా ప్రాథమిక విధాన మార్పులు. వీటి గురించి ఎలా ఆలోచించాలో అర్థం కావట్లేదు. ఇప్పటివరకు ప్రకటించిన సుంకాలు.. ఊహించిన దానికంటే చాలా ఎక్కువ. టారిఫ్‌ల వల్ల నెలకొన్న అనిశ్చితి ఆర్థిక వ్యవస్థకు శాశ్వత నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉంది. ఇక, టారిఫ్‌లను ఇలా పెంచుకుంటూ పోవడం వల్ల ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ప్రజలు కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. అటు ఆర్థిక మందగమనం కూడా మొదలవుతుంది" అని అంచనా వేశారు.

స్టాక్ మార్కెట్లు కూడా తీవ్ర ఊగిసలాటకు లోనవుతాయని పావెల్ హెచ్చరించారు. ఉపాధి కల్పన, ద్రవ్యోల్బణ నియంత్రణ వంటి ఫెడ్ లక్ష్యాలకు ట్రంప్ సుంకాలు ముప్పుగా మారుతున్నాయని విమర్శించారు.

భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై ఏప్రిల్ 2న ట్రంప్ సుంకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, దీనిపై తాత్కాలిక ఊరట కల్పిస్తూ 90 రోజుల పాటు టారిఫ్‌ల అమలును నిలిపివేశారు. కానీ, చైనాపై మాత్రం భారీస్థాయిలో సుంకాలు పెంచి, అవి కొనసాగుతాయని స్పష్టంచేశారు. అంతేగాక, ఈ నిర్ణయాన్ని ట్రంప్ పలుమార్లు సమర్థించుకున్నారు. అమెరికా ఆర్థికవృద్ధికి ఇదే సరైన చర్య అని, దీనివల్ల పెట్టుబడులు పెరుగుతాయన్నారు. మరోవైపు, సుంకాల తగ్గింపుపై పలు దేశాలు అమెరికాతో చర్చలు

## తదుపరి సీజేఐగా
# జస్టిస్ బి.ఆర్.గవాయ్

**సిఫారసు చేసిన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా**

**మే 14న బాధ్యతల స్వీకారం..**



**దిల్లీ: భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్(బి.ఆర్.గవాయ్) బాధ్యతలు చేపట్టనున్నారు. సీనియారిటీ పరంగా తన తర్వాత స్థానంలో ఉన్న ఆయన పేరును సంప్రదాయానికి అనుగుణంగా కేంద్ర న్యాయశాఖకు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా బుధవారం సిఫారసు చేశారు. దీనికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం లాంఛనమే కానుంది. మే 13న జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ చేయనున్నారు. 14న జస్టిస్ బి.ఆర్.గవాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు. 6 నెలలకుపైగా ఆ పదవిలో కొనసాగనున్న ఆయన నవంబరు 23న పదవీ విరమణ చేస్తారు.**

- జస్టిస్ గవాయ్ 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సీజేఐగా బాధ్యతలను చేపట్టనున్న రెండో దళిత వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించనున్నారు.
- ఆయన కన్నా ముందు 2007లో జస్టిస్ బాలకృష్ణన్ ఆ పదవిని అలంకరించారు.

### పలు రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యునిగా..

- మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబరు 24న జస్టిస్ బి.ఆర్.గవాయ్ జన్మించారు. 1985 మార్చి 16న న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత నాగ్‌పుర్, అమరావతి మున్సిపల్ కార్పొరేషన్లు, అమరావతి విశ్వవిద్యాలయానికి స్టాండింగ్ కౌన్సెల్‌గా పని చేశారు.
- 1992 ఆగస్టు నుంచి 1993 జులై వరకూ బాంబే హైకోర్టు నాగ్‌పుర్ ధర్మాసనంలో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలందించారు.
- 2000 జనవరి 17న ఆయన హైకోర్టు నాగ్‌పుర్ ధర్మాసనంలో ప్రభుత్వ న్యాయవాదిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు.
- 2003 నవంబరు 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2005 నవంబరు 12న శాశ్వత న్యాయమూర్తి అయ్యారు.
- సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తర్వాత అనేక రాజ్యాంగ ధర్మాసనాల్లో జస్టిస్ బి.ఆర్.గవాయ్ భాగమయ్యారు. చరిత్రాత్మక తీర్పులను వెలువరించారు.
- జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ 2023 డిసెంబరులో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన ఏకగ్రీవ తీర్పులో జస్టిస్ గవాయ్ భాగస్వామి.
- రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలోనూ జస్టిస్ గవాయ్ సభ్యులు.
- పెద్ద నోట్లను రద్దు చేస్తూ 2016లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 4-1తో ఇచ్చిన తీర్పులోనూ జస్టిస్ గవాయ్ పాలుపంచుకున్నారు.
- ఎస్సీ వర్గీకరణలో రాష్ట్రాలకు రాజ్యాంగపరమైన అధికారం కల్పిస్తూ ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 6-1తో ఇచ్చిన తీర్పులోనూ జస్టిస్ గవాయ్ సభ్యులే.
- స్టాంపుల్లేని, లేదంటే సరిపడా స్టాంపుల్లేని ఒప్పందాల్లో ఆర్బిట్రేషన్ క్లాజ్‌ను అమలు చేయవచ్చని, అటువంటి లోపాలను సరిచేయవచ్చని, ఆ కాంట్రాక్టులు రద్దు కాబోవని ఇచ్చిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ సభ్యులుగా ఉన్నారు.
- ముందుగా నోటీసు ఇవ్వకుండా ఎటువంటి కట్టడాలనూ కూల్చడానికి వీల్లేదని, ప్రభావితమయ్యే వ్యక్తికి సమాధానం ఇవ్వడానికి 15 రోజుల సమయం ఇవ్వాల్సిందేనని స్పష్టీకరిస్తూ దేశవ్యాప్తంగా మార్గదర్శకాలను ఖరారు చేస్తూ ఇచ్చిన తీర్పునకు జస్టిస్ గవాయ్ నాయకత్వం వహించారు.
- అడవులు, వన్యప్రాణి సంరక్షణ, వృక్షాల రక్షణకు సంబంధించిన కీలక కేసుల విచారణకు ఆయన నాయకత్వం వహిస్తున్నారు.

## ఆదాయ పన్ను వద్దు..
# టారిఫ్‌ల ఆదాయమే ముద్దు: ట్రంప్



**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల నుంచి వసూలుచేయనున్న టారిఫ్‌లపై భారీ అంచనాలు పెట్టుకొన్నారు. దేశానికి ఈ సొమ్ము లభిస్తే ఇప్పటికే ప్రజల నుంచి వసూలుచేస్తున్న ఆదాయపు పన్ను అవసరం ఇక ఉండబోదని అభిప్రాయ పడ్డారు. తాజాగా ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 1870-1913 మధ్యలో అమెరికాలో ఇన్‌కమ్ ట్యాక్స్ లేదని.. టారిఫ్‌లే ప్రభుత్వ ప్రధాన ఆదాయవనరని వెల్లడించారు. ఆ సమయంలో అమెరికా అత్యంత సంపన్నదేశంగా వర్ధిల్లిందన్నారు. 1880ల్లో మిగులు నిధులు ఖర్చు చేసేందుకు ఓ కమిటీని కూడా ఏర్పాటుచేశారన్నారు. కానీ, 1913లో ఆదాయపు పన్ను వచ్చాక పరిస్థితి మారిందని చెప్పారు.**

"టారిఫ్‌ల నుంచి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అది ఆదాయపు పన్నును భర్తీ చేస్తుంది. ప్రస్తుతం విధిస్తున్న పన్నులతో రోజుకు రెండు నుంచి మూడు బిలియన్ డాలర్ల ఆదాయం లభిస్తుంది. గతంలో ఎన్నడూ ఇంత మొత్తం రాలేదు" అని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. వ్యాపారాలు దెబ్బతినకుండా తాత్కాలికంగా సుంకాలకు విరామం ప్రకటించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తాను విధిస్తున్న సుంకాలను గ్రేట్ డిప్రెషన్ సమయంతో పోల్చడాన్ని ట్రంప్ కొట్టిపారేశారు. సుంకాల అమలుకు ముందే ఆ పరిస్థితి నెలకొందన్నారు.

అమెరికా క్రిమినల్ జస్టిస్‌లో మార్పుల అంశంపై ట్రంప్ స్పందిస్తూ..ఎల్ సాల్వడార్ ప్రెసిడెంట్ నయిబ్ అనుసరిస్తున్న భద్రతా చర్యలను అభినందించారు. భారీ జైళ్లను నిర్మించడాన్ని మెచ్చుకొన్నారు. అంతేకాదు.. బైడెన్ సమయంలో దేశంలోకి అనుమతించిన నేరగాళ్లను వాటిలోకి పంపిస్తామన్నారు.

## ఆ డబ్బులను ప్రజా అవసరాలకు వినియోగించాలి : దొండా



అల్లవరం, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వడ్డాది మేజర్ పంచాయతీలో ఐదేళ్ల క్రితం ఇసుక రవాణా ద్వారా గ్రామానికి వచ్చిన రూ.15 లక్షల సొమ్మును ప్రజా అవసరాలకు వినియోగించాలని స్థానిక మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దొండా గిరిబాబు కోరారు.గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా 10ఏళ్ల క్రితం మోదకొండమ్మ జాతర నిమిత్తం సేకరించిన విరాళాలు సొమ్ముతో పాటు,20 ఏళ్ల క్రితం కాపు ,తెలగా సంక్షేమ సంఘంకి సేకరించిన సొమ్మును కూడా గ్రామ ప్రజా ప్రయోజనాలకి వినియోగించాలని కోరారు.

గ్రామ పెద్దలు, అఖిలపక్ష కమిటీ సభ్యులు,ప్రజలు తీర్మానించి అందరికీ ఆమోదయోగ్యమైన పనులు చేపట్టాలన్నారు.గ్రామ దేవత మోదకొండమ్మ పండగను కూడా నిర్వహించాలన్నారు. సంబంధిత డబ్బులు ఎక్కడున్నాయి, ఎంత ఉన్నాయో గ్రామ ప్రజలకు బహిర్గతం చేయాలన్నారు.ఈ సొమ్ముపై గ్రామస్తుల్లో ఉన్న అపోహలు తొలగించాలన్నారు. గ్రామాభివృద్ధి దృష్ట్యానే తాను ఈ విషయాలను ప్రస్తావిస్తున్నట్లు తెలిపారు. తనకు వ్యక్తిగత స్వార్థం ఏమీ లేదన్నారు.ఈ విషయాలను బహిర్గతం చేసి ప్రజా ఆమోదయోగ్య పనులు చేపట్టకపోతే తానే నిరశన కార్యక్రమాలు చేపడతానన్నారు.

## రాహుల్ గాంధీ అమెరికా పర్యటన ఖరారు



అమెరికా : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ఆయన ఈనెల 21 నుంచి 22 వరకు అగ్రరాజ్యంలో పర్యటించనున్నారు. ఆ పార్టీ నేత పవన్ ఖేడా గురువారం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు.

ఏప్రిల్ 21, 22 తేదీల్లో రాహుల్‌గాంధీ యూఎస్‌లో పర్యటిస్తారని ఖేడా తెలిపారు. ఈసందర్భంగా ఆయన రోడ్ ఐలాండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీని సందర్శిస్తారన్నారు. ఆ వర్సిటీలోని విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడతారని తెలిపారు. దీనికి ముందు ఆయన ఎన్నారై సంఘ సభ్యులతో పాటు ఇండియా ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులతోను సమావేశమవుతారని వెల్లడించారు.

ఇక, గతేడాది సెప్టెంబరులో రాహుల్ మూడ్రోజులు యూఎస్‌లో పర్యటించారు. ఈ పర్యటన సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాహుల్ రిజర్వేషన్లు, భారత్‌లో మతస్వేచ్ఛ వంటి అంశాలపై మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు దేశీయంగా తీవ్ర దుమారం రేపాయి. సిక్కులను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భాజపా ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువు తీస్తున్నారని మండిపడింది.

## అమిత్‌షాను ప్రధాని నియంత్రించాలి



కోల్‌కతా: వక్ఫ్ సవరణ చట్టం కారణంగా పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో చెలరేగిన అల్లర్ల వెనుక భాజపా, సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) హస్తం ఉందంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. సరిహద్దు గుండా బయటి వ్యక్తులు రాష్ట్రంలోకి ప్రవేశించేందుకు అనుమతినిచ్చి హోంమంత్రిత్వ శాఖ, బీఎస్‌ఎఫ్‌లోని ఒక విభాగం బెంగాల్‌లో ఉద్రిక్తతలకు కారణమయ్యాయని బుధవారం ఆమె ముస్లిం మత పెద్దల సమావేశంలో ఆరోపించారు.

"ముర్షిదాబాద్ అల్లర్లలో బయటి వ్యక్తుల పాత్ర ఉందన్నది హోంశాఖ వర్గాల నుంచి నేను తెలుసుకున్నాను. సరిహద్దు భద్రత బీఎస్‌ఎఫ్ బాధ్యత. బెంగాల్‌ను అప్రతిష్ఠ పాలు చేయడం కోసం భారీ ప్రచార యంత్రాంగం ఉంది. వీటిని అమిత్‌షా నియంత్రిస్తున్నారు" అని అన్నారు. అమిత్ షా పై ఓ కన్నేసి ఉంచాలని ప్రధాని మోదీని మమత కోరారు. ఆయన సొంత ఎజెండా కోసం దేశానికి హాని తలపెడుతున్నారని విమర్శించారు. "యూపీ సీఎం ఆదిత్యనాథ్ తాను పెద్ద సాధువులా మాట్లాడుతున్నారు. కానీ ఆయన అతిపెద్ద భోగి. మహా కుంభమేళా తొక్కిసలాటలో ఎంతమంది చనిపోయారు? యూపీలో ఎన్ని ఎన్‌కౌంటర్ హత్యలు జరుగుతున్నాయి?" అని మమత ప్రశ్నించారు.

## జియో సింథటిక్స్‌తో బహుళ ప్రయోజనాలు



### నిర్మాణరంగంలో విరివిగా వినియోగం
### సుస్థిర పరిష్కారాలను నిపుణులు సూచించాలి
### వి.ఎం.ఆర్.డి.ఏ చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్

విశాఖపట్నం ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జియో సింథటిక్స్ బహుళ ప్రయోజనకరంగా నిలుస్తున్నాయని వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజనీర్ ఎం.వినయ్ కుమార్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ విశాఖ ప్రాంతీయ కేంద్రం, మెకఫెరి సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఒకరోజు సదస్సును బుధవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఏ.యూ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో చనర్చరింగ్ ద నేషన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విత్ సస్టైనబుల్ జియోసింథటిక్ సొల్యూషన్స్ అనే అంశంపై ఈ సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిఎమ్ఆర్డీఏ చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ మానవ మేధస్సు నుంచి జియో సింథటిక్స్ ఉద్భవించిందని అన్నారు. గత మూడు శతాబ్దాలుగా దీని ప్రాముఖ్యత పెరుగుతూ వస్తోందని అన్నారు. విశాఖలో నిర్మించిన తొలి ఫ్లైఓవర్ నిర్మాణంలో కూడా జియో సింథటిక్స్ వినియోగించామని చెప్పారు. యువ ఇంజనీర్లు ఈ రంగాన్ని తమ కెరియర్ గా మలచుకోవడానికి సదస్సు ఎంతో ఉపయోగంగా నిలుస్తుందని చెప్పారు. నిపుణులు సుస్థిర పరిష్కారాలను అందించాలని సూచించారు. నూతన అంశాలను నేర్చుకోవడానికి, అవగాహన పెంచుకోవడానికి నిర్మాణ రంగాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ఇటువంటి సదస్సులు ఉపయుక్తంగా నిలుస్తాయని చెప్పారు. పర్యావరణ సమతుల్యతను సమర్థవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని సూచించారు. మెకఫెరి సంస్థ బిజినెస్ హెడ్ గిన్లుకా స్పాడారో మాట్లాడుతూ పర్యావరణం అనేక నూతన సవాళ్లను విసురుతోందన్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి లభ్యత తక్కువగా ఉండడం, మరికొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు నిర్మాణ రంగానికి సవాళ్లుగా మారుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో నీటి వనరుల నిర్వహణ కీలకంగా మారుతుందని చెప్పారు. జియో సింథటిక్స్ ఉపయోగించి సుస్థిరమైన పరిష్కారాలను అందించడం సాధ్యపడుతుందని అన్నారు. నిర్మాణ ఖర్చును సైతం తగ్గించడానికి జియో సింథటిక్స్ ఎంతో ఉపయోగంగా ఉంటాయని చెప్పారు. ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ విశాఖపట్నం కేంద్రం చైర్మన్, ఏయూ సివిల్ ఇంజనీరింగ్ ఆచార్యులు సి.ఎన్.వి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ రంగంలో నూతన ప్రాజెక్టుల నిర్మాణంలో జియో సింథటిక్స్ వినియోగం గణనీయంగా పెరిగిందని చెప్పారు. సాధారణ విధానాలకు భిన్నంగా జియో సింథటిక్ ఉపయోగిస్తూ పటిష్టమైన, తక్కువ ఖర్చుతో కూడిన దీర్ఘకాలం మన్నే నిర్మాణాలు చేయడం సాధ్యపడుతుందని తెలిపారు. జియో సింథటిక్ పై సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో కోర్స్ సైతం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశాఖ విమానాశ్రయం రన్ వే పటిష్టతకు, ఇతర ప్రాంతాలలో బహుళ నిర్మాణాలు చేపట్టడానికి జియో సింథటిక్ మెటీరియల్స్ ను వినియోగించామని చెప్పారు. కార్యక్రమంలో మెకఫెరి టెక్నికల్ హెడ్ రత్నాకర్ మహాజన్, జియో సింథటిక్స్ బిజినెస్ విభాగం హెడ్ సౌర్య దాస్, ప్రొఫెసర్ రాజగోపాల్ ఆచార్య సి.ఎన్.వి సత్యనారాయణ రెడ్డి తదితరులు సాంకేతిక ప్రసంగాలను అందించారు. సదస్సులో పరిశ్రమల నిపుణులు, సివిల్ ఇంజనీరింగ్ ఆచార్యులు వివిధ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పోర్టుల నిర్మాణం, నేల కోత నివారణ, జాతీయ రహదారులపై డ్రైనేజీల నిర్మాణం, జియో సింథటిక్స్ ఉపయోగించడం వలన కలిగే ప్రయోజనం, వివిధ ప్రాంతాలలో జియో సింథటిక్స్ వినియోగించి చేసిన నిర్మాణాలు-వాటి ప్రాముఖ్యతలు, రైల్వే లైన్ ఎయిర్ పోర్ట్ రన్ వే ల నిర్మాణంలో జియో సింథటిక్ వినియోగం ఉపయోగాలు తదితర అంశాలపై నిపుణులు ప్రసంగించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. నిర్మాణ రంగానికి సంబంధించిన వివిధ సమస్యలపై మెకఫెరి సంస్థ ప్రతినిధులు, ఏ.యూ సివిల్ ఇంజనీరింగ్ విభాగ ఆచార్యులు, నిపుణులు ప్రత్యక్ష అవగాహన కల్పించడం జరిగింది.

## భవిష్యత్తు అంతా ఏఐ ఆధారితంగానే పనిచేస్తుంది

### యువత ఈ రంగంలో నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి.. యువత మేధస్సుకు మంచి అవకాశం



అల్లవరం, ఏప్రిల్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా నడుస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ భాగం సంయుక్తంగా బుధవారం నిర్వహించిన బిల్డ్ భారత్ హాక్ థాన్ ను ప్రారంభించారు.

యువత మేధస్సుకు పదును పెట్టే విధంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సృజనాత్మకంగా పనిచేస్తూ నూతన ఆవిష్కరణలు జరపాలని సూచించారు. ఇటువంటి హ్యాక థాన్ లో భాగస్వామ్యం కావడం వలన యువతలో కోడింగ్ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని అన్నారు. యువత ఇక్కడ నుంచి స్ఫూర్తిని పొంది నూతన అంకుర సంస్థలను స్థాపించే విధంగా అడుగులు వేయాలని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకట రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల నుంచి, 488 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. యువతను ప్రోత్సహించడం, వారి ఆలోచనల నుంచి అనేక సమాజ ఉపయుక్త పరిష్కారాలను తీసుకురావడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని అన్నారు. కార్యక్రమంలో ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు, ఆచార్య వి. వల్లి కుమారి, డాక్టర్ జి. లావణ్య దేవి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆ హాబ్ సీఈవో రవి ఈశ్వరప్పు, డిజి ఫాక్ సీఈవో అమల్ రాజ్ తదితరులు ప్రసంగించారు.

# 26 బంతుల్లో సెంచరీ.. 24 సిక్సర్లతో ఊచకోత





**క్రికెట్ లో సంచలనం సృష్టించిన 23 ఏళ్ల యువ బ్యాటర్ జైన్ నఖ్వీ ఇటు భారత్ లో ఐపీఎల్ 2025 టోర్నమెంట్ ఫీవర్ నడుస్తుండగానే యురోపియన్ క్రికెట్ లీగ్ లో ప్రతిష్టాత్మక ప్రదర్శన కనబరిచాడు. ఇప్పటివరకు ఆడిన ఐపీఎల్ మ్యాచ్‌లలో చాలా మంది బ్యాటర్లు అద్భుతంగా రాణించారు, కానీ జైన్ నఖ్వీ మాత్రం 26 బంతుల్లో సెంచరీ సాధించి క్రికెట్ ప్రపంచంలో సంచలనం సృష్టించాడు. ఈ సంచలన ప్రదర్శనతో జైన్ నఖ్వీ క్రికెట్ లో కొత్త తరం ఆడగల ఆటగాడిగా ఎదిగాడు.**

జైన్ నఖ్వీ విస్ఫోటనంతో అదరగొట్టాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లోనూ అతనిపై అంచనాలు ఎక్కువగానే ఉండాయి. అయితే, అతని అద్భుత ప్రదర్శనకు సంబంధించిన విశేషం తన ఫోరములే కాదు, యూరోపియన్ టీ20 మ్యాచ్‌లో అతని మెరుపు బ్యాటింగ్ కూడా అతన్ని క్రికెట్ లో సంచలనాత్మక ఆటగాడిగా నిలిపింది. యూరోపియన్ టీ20లో టీమ్ సివిడేట్, మారో?ర్ మిలానో జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జైన్ నఖ్వీ ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మారో?ర్ మిలానో తరపున ఆడిన జైన్ నఖ్వీ చివరి ఓవర్లో 6 బంతుల్లో వరుసగా 6 సిక్సర్లు బాదాడు. ఈ సలివరీతో అతను చరిత్ర పుటల్లో తన పేరును నమోదు చేసుకున్నాడు.

జైన్ నఖ్వీ 26 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి మరొక సంచలనంగా మారాడు. తన సెంచరీ పూర్తయిన తర్వాత కూడా అతను బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 37 బంతుల్లో 160 పరుగులు సాధించి, జైన్ నఖ్వీ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతను ఈ ఇన్నింగ్స్ లో 24 సిక్సర్లు, 2 ఫోర్లు కొట్టాడు. జైన్ నఖ్వీ 432.43 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేశాడు.

మారో?ర్ మిలానో జట్టు మొదట బ్యాటింగ్ చేసి జైన్ నఖ్వీ సెంచరీతో 2 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. జైన్ కాకుండా, అటా ఉల్లా 2 పరుగులు మాత్రమే చేశాడు, వాసల్ హుస్సేన్ 25 పరుగులు చేశాడు. 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సివిడేట్ జట్టు 9 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌటైంది. సివిడేట్ తరపున షాబాజ్ మసూద్ అత్యధికంగా 34 పరుగులు చేశాడు.

జైన్ నఖ్వీ ఇటలీ జట్టు తరపున ఆడుతున్నాడు. ఇప్పటివరకు జైన్ నఖ్వీ 4 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఇటలీకి ప్రాతినిధ్యం వహించాడు. ఈ కాలంలో అతను 7 పరుగులు మాత్రమే చేశాడు. కానీ ఇప్పుడు అతని ఈ అద్భుత ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచం మొత్తం అతని పేరు గురించి మాట్లాడుకుంటోంది. 26 బంతుల్లో సెంచరీ సాధించడం, క్రికెట్ ప్రపంచంలో అతను అందుకున్న ప్రాధాన్యతను పటిష్టం చేస్తుంది.

# చరిత్ర సృష్టించిన రాజస్థాన్ టెంపరరీ కెప్టెన్!

## బ్యాటింగ్‌లోనే కాదు ఫీల్డింగ్‌లోనూ తోపే భయ్యా

**ఐపీఎల్ 2025 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ %జం% ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌లో ఎన్నో కీలక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇందులో ఒక ముఖ్యమైన ఘట్టం, రియాన్ పరాగ్ చేసిన రికార్డు స్థాయి ఫీల్డింగ్ ప్రదర్శన. తక్కువ కాలంలోనే రాయల్స్ జట్టులో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న రియాన్ పరాగ్, ఈ మ్యాచ్ ద్వారా మరో చరిత్రను సృష్టించాడు. బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ మెరిసే పరాగ్, ఈసారి తన ఫీల్డింగ్ నైపుణ్యంతో అజయమైన ఘనతను అందుకున్నాడు.**



అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో, ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌లో అభిషేక్ పోరెల్ స్లోగ్ షాట్‌ను డీప్‌లో రియాన్ పరాగ్ అద్భుతంగా క్యాచ్ తీసి ఔట్ చేశాడు. ఈ క్యాచ్‌తో అతను రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఆటగాడిగా ఎదిగాడు. గతంలో ఈ ఘనత మాజీ కెప్టెన్ అజింక్య రహానే సొంతం చేసుకున్నాడు, కానీ ఇప్పుడు పరాగ్ అతన్ని అధిగమించాడు. రహానే 106 మ్యాచ్‌లలో 40 క్యాచ్‌లు పట్టగా, పరాగ్ మాత్రం కేవలం 77 మ్యాచ్‌ల్లోనే 41 క్యాచ్‌లు అందుకున్నాడు. దీంతో అతను టాప్‌లో నిలవగా, జోస్ బట్లర్ 31 క్యాచ్‌లతో మూడో స్థానంలో ఉన్నాడు.

ఈ చారిత్రాత్మక క్షణం విషయంలో వనిందు హసరంగా వేసిన గూగ్లీ బంతికి పోరెల్ భారీ షాట్‌కు యత్నించగా, పరాగ్ డీప్‌లో ముందుకు పరుగెత్తుతూ అద్భుత క్యాచ్‌ను అందుకున్నాడు. ఇది కేవలం ఒక వికెట్ మాత్రమే కాదు, అతని ఫీల్డింగ్ కెరీర్‌లో గుర్తుంచుకోదగ్గ ఘట్టం కూడా. ఇక మ్యాచ్ తుది ఘట్టం మరింత ఉత్కంఠ రేపింది. 188 పరుగుల లక్ష్యాన్ని ఛేధించాల్సిన రాజస్థాన్, చివరి ఓవర్‌కు వచ్చేసరికి కేవలం 9 పరుగులే అవసరం. కానీ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున మిచెల్ స్టార్క్ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శించి, కేవలం 8 పరుగులే ఇచ్చి మ్యాచ్‌ను సూపర్ ఓవర్‌కు తీసుకెళ్లాడు. ఈ ప్రదర్శనపై సంజు సామ్సన్ కూడా ప్రత్యేకంగా స్పందించాడు. "స్టార్క్ నిజంగా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతను ఎందుకు ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో ఒకడో అందరికీ చూపించాడు. 20వ ఓవర్లోనే మ్యాచ్‌ను గెలిపించాడు," అంటూ ప్రశంసలతో ముంచెత్తాడు. సూపర్ ఓవర్‌లో రాజస్థాన్ రాయల్స్ 11 పరుగులు మాత్రమే చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ తరపున %ఖూ% రాహుల్ మరియు ట్రిస్టన్ స్టబ్స్ క్రీజ్‌లోకి వచ్చి, కేవలం నాలుగు బంతుల్లోనే లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని నమోదు చేశారు. చివరి ఓవర్‌తో పాటు సూపర్ ఓవర్‌లోనూ సందీప్ శర్మ రాజస్థాన్ తరపున బౌలింగ్ బాధ్యతలు చేపట్టాడు. కాగా, ఈ మ్యాచ్‌లో సందీప్ శర్మ వేసిన ఓవర్ కూడా అభిమానులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. అతను ఒకే ఓవర్‌లో 11 బంతులు వేయడంతో ఐపీఎల్ చరిత్రలో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు.

# హైదరాబాద్ వ్యాపారితో జాగ్రత్త.. బీసీసీఐ హెచ్చరిక!

ముంబయి: హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి చట్టవ్యతిరేక పనులు చేసేలా వ్యక్తులను ఒత్తిడికి గురి చేస్తున్నాడంటూ ఐపీఎల్‌తో ముడిపడి ఉన్న అందరినీ బీసీసీఐ హెచ్చరించింది. అతడి విషయంలో జాగ్రత్తగా ఉండాలని క్రికెటర్లు, కోచ్‌లు, సహాయ సిబ్బంది, వ్యాఖ్యాతలకు సూచించింది. ఆ వ్యాపారికి బుకీలతో సంబంధాలున్నాయని బీసీసీఐ () అవినీతి నిరోధక విభాగం భావిస్తోందని సమాచారం. ఐపీఎల్‌లోని వ్యక్తులతో స్నేహం చేయడానికి, సంబంధాలు పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని తెలుస్తోంది. ఖరీదైన బహుమతులు ఇవ్వడం ద్వారా ఇప్పటికే కొంతమందితో పరిచయం పెంచుకున్నాడట.

# బౌలర్లకు చుక్కలు చూపించిన సిక్స్ హిట్టర్!



**2025 సీజన్ మైదానంలో హీట్ పెరుగుతున్న వేళ, ముంబై ఇండియన్స్ నెట్ సెషన్లలో ఒక ప్రత్యేక దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్ తన 'వింటేజ్' ఫామ్‌ను తిరిగి చూపిస్తూ అభిమానులకు నోస్టాల్జియా మూటలు తెరిచాడు. వాంఖడే స్టేడియంలో నెట్స్‌లో ఫెరారీలా గాల్లోకి కట్టిన అతని సిక్సర్లు అతని ఆట రోజుల మాదిరిగా ఊపిరి ఆపేస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా పొలార్డ్ మ్యాజిక్ మర్చిపోయారంటే, అతను తిరిగి తన శైలిలో ప్రాక్టీస్ చేస్తూ మళ్లీ గుర్తు చేశాడు. ఆ శక్తివంతమైన హిట్స్, క్లాస్ ఫినిషింగ్ టచ్, ఇంకా స్టైల్ అన్నీ నెట్స్‌లో బలంగా కనిపించాయి.**

పోలార్డ్ 12 ఐపీఎల్ సీజన్లలో 223 సిక్సర్లు బాది ఆల్ టైమ్ టాప్ సిక్స్‌హిట్టర్స్ జాబితాలో ఏడో స్థానంలో నిలిచాడు. తన సిక్స్ ఫెస్టివల్‌తో క్రిస్ గేల్, డివిల్లియర్స్ వంటి దిగ్గజాలతో ఒకే వరుసలో నిలబడ్డాడు. గతంలో ముంబైకి మ్యాచ్ ఫినిషింగ్‌లో భరోసా ఇచ్చిన ఆటగాడిగా ఉన్న పొలార్డ్, ఇప్పుడు జట్టు గ్లోబల్ టీ20 నెట్‌వర్క్‌కు మార్గదర్శకుడిగా ఉన్నాడు. %వా=న%తో జరిగిన కీలక మ్యాచ్ ముందు, ముంబై ఫ్రాంచైజీ పొలార్డ్ నెట్ సెషన్‌ను వీడియో రూపంలో విడుదల చేసింది, ఇందులో అతను స్పిన్నర్లను వరుసగా బౌండరీల దిశగా తరుముతూ కనిపించాడు. అతని శక్తి ఏ మాత్రం తగ్గలేదనేది ఈ వీడియో ద్వారా తేలిపోయింది. అంతేగాక, ఓ స్ట్రైక్ బంతి నేరుగా కెమెరా లెన్స్‌ను బద్దలుకొట్టడం అభిమానులను ఆశ్చర్యపరిచింది.

ఐపీఎల్ నుంచి ఆటగాడిగా రిటైరైనా కూడా, పొలార్డ్ తన బ్యాటింగ్ మేజిక్‌ను కొనసాగిస్తూనే ఉన్నాడు. 2025 ILT 20 టోర్నీలో MI ఎమిరేట్స్ తరపున పాల్గొన్న పొలార్డ్ 11 సిక్సర్లు బాది తన శక్తిని మళ్లీ నిరూపించాడు. అతని ఆట తీరును చూసిన అభిమానులు, "పోలార్డ్ ఆట ఆపినప్పటికీ మంట ఆగలేదు" అని అంటున్నారు.

ఇక ముంబై ఇండియన్స్ జట్టు విషయానికొస్తే, హార్దిక్ పాండ్యా నాయకత్వంలో వారు మళ్లీ స్థిరత్వం అందుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించినప్పటికీ, మిశ్రమ హోమ్ రికార్డు మాత్రం వాళ్లను వెనక్కి లాగుతోంది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై గెలుపు తర్వాత, బెంగళూరుతో మ్యాచ్‌ను కొంచెం తేడాతో చేజార్చుకోవడం వల్ల జట్టు అస్థిరత స్పష్టంగా కనిపించింది.

ఇదిలా ఉంటే, పంజాబ్ కింగ్స్‌పై 246 పరుగుల భారీ ఛేజింగ్‌తో ఐపీఎల్ చరిత్రలో రెండవ అత్యధిక ఛేజింగ్ రికార్డును సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఊపుమీదుంది. ఇప్పుడు ఈ రెండు జట్లు పాయింట్ల పట్టికలో పైకి రావడానికి పోటీపడుతున్న నేపథ్యంలో SRH-MI మధ్య మ్యాచ్ ఫుల్ టెన్షన్ తో ఉండనుంది. ఈ క్రమంలో, నెట్ సెషన్‌లో దూకుడు చూపించిన పొలార్డ్ బ్యాటింగ్‌ను చూసి ముంబై అభిమానులు ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. "పోలార్డ్ ఇలా హిట్స్ కొడితే, మళ్లీ ప్లేయర్‌గా ఆడినా ఆశ్చర్యం లేదు" అన్న అభిప్రాయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఫ్లాప్ షో చూపిస్తున్న మరో ఆసీస్ ప్లేయర్




**ఐపీఎల్ 2025 సీజన్‌లో జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్ డిల్లీ క్యాపిటల్స్ జట్టుకు అంచనాల ప్రకారం ప్రదర్శించలేకపోయాడు. 9 కోట్లు వెచ్చించి అతనిని కొనుగోలు చేసిన DC, సీజన్ 2024 లో మంచి ఆటతీరుతో కనుమరుగైన జేక్‌ను 2025లో ఫ్లాప్ గా చూసింది. మొదటి 6 మ్యాచ్‌లలో అతని కష్టాలు కొనసాగడం DC జట్టుకు ఒక నిరాశను కలిగించాయి. JFM ఆటశైలి, అతనికి ఈ సీజన్‌లో చేదు అనుభవంగా మారింది.**

ఐపీఎల్ 2024 ముందు, ఆస్ట్రేలియన్ క్రికెటర్ జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్ గురించి భారీ హైప్ ఏర్పడింది. కానీ ఆస్ట్రేలియాతో మంచి ప్రదర్శన ఇచ్చిన తర్వాత కూడా, అతని IPL సీజన్ పూర్తిగా విఫలమైంది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో అతని ప్రదర్శన కనీసం కూడా ఆశించిన స్థాయిలో లేదు. మొదటి 6 మ్యాచ్‌లలో, అతను ప్రతీ మ్యాచ్‌లో పతనాన్ని ఎదుర్కొన్నాడు, ఈ సీజన్‌లో అతనికి హైప్ ఇవ్వడం వెనుక ఉన్న ఆశలు అంతా ఆడిపోతున్నాయి. JFM యొక్క ప్రదర్శనను పరిశీలిస్తే, అతను 6 బంతుల్లో 9 పరుగులు చేసి అవుట్ అయిన దృష్టితో అతని ఫ్లాప్ షో మరింత స్పష్టమవుతుంది. ఇక, 2024 సీజన్‌లో 9 మ్యాచ్‌లలో 330 పరుగులు సాధించినప్పటికీ, 2025 సీజన్‌లో 6 మ్యాచ్‌లలో అతను కేవలం 55 పరుగులు మాత్రమే చేశాడు. అటువంటి క్రమంలో, అతని స్ట్రైక్ రేట్ కూడా భారీగా పడిపోయింది. అతని స్ట్రైక్ రేట్ 234.04 నుంచి 105.77కి మారింది. ఐపీఎల్ 2024లో JFM యొక్క ప్రదర్శన చూసి, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అతనికి 9 కోట్లు వెచ్చించి అతన్ని కొనుగోలు చేసింది. ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు వారు అతనిని ఒక దీర్ఘకాలిక ఓపెనింగ్ బ్యాటర్‌గా నమ్మారు. కానీ, 2025 సీజన్‌లో అతను అదే ఫామ్‌ను కొనసాగించలేకపోయాడు. అతనికి కనీసం ఒక మంచి స్ట్రైక్ రేట్ కూడా లభించలేదు, ఇది DC పెంచుకున్న ఆశలను దెబ్బతీసింది.

JFM కష్టాలు ఎందుకు వచ్చాయి? ఈ ప్రశ్నకు సమాధానం అతని ఆటశైలిలోనే దాచింది. ఒక దూకుడు బ్యాటర్‌గా, ప్రతి బంతినీ శక్తివంతంగా హిట్టు చేయడం అతని సహజ స్వభావం. అయితే, ఈ విధానం తరచూ బోల్తా పడుతుంది. అతని కష్టాలు ఎక్కువగా అనుకున్న ప్లాన్ A విఫలమైనప్పుడు వాటి ప్రతికూల ఫలితాలుగా కనిపిస్తాయి. ప్రతీ సారి అతను పెద్ద హిట్లు కొట్టడానికి ప్రయత్నిస్తాడు, కానీ ఫీల్డర్ల చేతిలో చిక్కుకుని అవుట్ అవుతాడు. ఈ సీజన్‌లో, అతను ఎక్కువగా ఈ విధానంలో అవుట్ అవుతున్నాడు. అతని భుజం ముందుకు వెళ్లిపోవడం, అతను చేస్తే అనుకోకుండా అలా అవుట్ అవడం జేకే ఫ్రేజర్-మెక్‌గుర్క్‌కు ఒక అలవాటుగా మారిపోయింది. ఈ విధానం చాలా సార్లు అతనికి దెబ్బతీస్తుంది.

ఇలాంటి హైప్‌ను పొందిన తర్వాత, JFM యొక్క ఫ్లాప్ ప్రదర్శన అతనికి, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఒక గోప్యమైన సవాలు గా మారింది. DC కొత్తగా వేచి ఉన్న జట్టుగా వృద్ధి చెందాలంటే, వారిని ఆశావహంగా నిలబడే ఆటగాళ్లతో పునరుద్ధరించాల్సి ఉంటుంది.

## మంచి నిర్ణయమే తీసుకున్నా నిధి అగర్వాల్



'ఈ ఏడాది నాకు తిరిగి పుంజుకున్న సంవత్సరంలా అనిపిస్తుంది. ఎందుకంటే 'హరి హర వీరమల్లు' సినిమా కోసం ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నా. దానికి సీక్వెల్ ఉండటం నాకు కలిసొచ్చిన విషయం. ఈ సినిమా ఐదేళ్లుగా నిర్మాణంలో ఉంది. అందువల్ల కొత్త ప్రాజెక్టులపై నేను సంతకం చేయలేకపోయా. అయితే నేను సరైన నిర్ణయం తీసుకున్నానా? లేదా అనేది ఆలోచించిన రోజులు ఉన్నాయి. సినిమా ఆలస్యమైనందున ప్రేక్షకులు నన్ను మరచి పోతారనే భయాన్ని కొందరు ప్రసారం చేశారు. నా చుట్టూ ఉన్న వాళ్లు కూడా అలాంటి ఆలోచన లను ప్రోత్సహించారు. అయినా నేను నా వరకూ సినిమా పూర్తయ్యే వరకూ ఎలాంటి రూమర్స్ గురించి పట్టించుకోకుండా పనిచేస్తున్నా. చిన్నప్పుడు నటి కావాలని కోరుకున్నా. ఇప్పుడు గుర్తింపు వచ్చింది. పెద్ద సినిమాల్లో అవకాశాలు రావటం బోనస్‌గా భావిస్తున్నా' అని కథానాయిక నిధి అగర్వాల్ అన్నారు. పవన్‌కళ్యాణ్ కథా నాయకుడిగా, నిధి అగర్వాల్ కథానాయికగా తెరకెక్కుతున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. రెండు భాగాలుగా ఈ సినిమా తెరకెక్కుతోంది. మొదటి పార్టు మే 9న విడుదల కానుంది. క్రిష్, జ్యోతికృష్ణ దర్వకత్వంలో ఈ సినిమా తెరకెక్కిన విషయం తెలిసిందే.

## అంతర్జాతీయంగా మరో ఘనత సాధించిన 'బాహుబలి-1'

**ప్రపంచ వ్యాప్తంగా రూ. 600 కోట్లు వసూలు చేసిన 'బాహుబలి-1'**
**స్పానిష్ భాషలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన నెట్ ఫ్లిక్స్**
**ఇంగ్లీష్ టైటిల్స్ తో స్ట్రీమింగ్ అవుతున్న బ్లాక్ బస్టర్ మూవీ**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, దర్శకదిగ్గజం రాజమౌళి కాంబినేషన్లో వచ్చిన 'బాహుబలి' చిత్రాలు భారతీయ సినీ పరిశ్రమ ఘనతను తార స్థాయికి తీసుకెళ్లాయి. ముఖ్యంగా టాలీవుడ్ సత్తాను ఈ సినిమాలు విశ్వవ్యాప్తం చేశాయి. తాజాగా 'బాహుబలి-1' సినిమా అంతర్జాతీయంగా మరో ఘనతను సాధించింది.

'బాహుబలి-1' సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ. 650 కోట్లకు పైగా వసూలు చేసి ప్రభంజనం సృష్టించింది. తాజాగా నెట్ ఫ్లిక్స్ వేదికగా ఇప్పుడు స్పానిష్ భాషలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. స్పానిష్ భాషలో ఇంగ్లిష్ సబ్ టైటిల్స్ తో ఈ సినిమా నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాను అంతర్జాతీయ మాధ్యమాల్లో మరింతగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలని నెట్ ఫ్లిక్స్ భావిస్తోంది.

ఈ చిత్రంలో అనుష్క, తమన్నా, రానా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్, కిచ్చా సుదీప్ తదితరులు ప్రధాన ప్రాత్రలు పోషించారు. ఎం.ఎం కీరవాణి సంగీతం అందించారు. ఆర్కా మీడియా వర్క్ ఈ చిత్రాన్ని నిర్మించింది. 2015 జులై 10 ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రూ. 180 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ చిత్రం... అఖండ విజయాన్ని సాధించి రూ. 650 కోట్లకు పైగా వసూలు చేసింది.






## ఉత్తమ నటుడిగా అవార్డు గెలుచుకున్న పృథ్వీరాజ్

మలయాళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తాజాగా మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. 'ఎల్2 ఎంపురాన్' సినిమాతో ఒకవైపు దర్శకుడిగా బ్లాక్ బస్టర్ అందుకున్న మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తాజాగా మరో ఘనతను అందుకున్నాడు. కేరళ సినీ నటులు ప్రతిష్టాత్మకంగా భావించే కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డ్స్ 54వ వేడుకలు కేరళలోని తిరువనంతపురంలో ఘనంగా జరుగగా ఈ వేడుకలలో ఉత్తమ నటుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ కేరళ సీఎం పినరయి విజయన్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. 'ఆడు జీవితం (ది గోట్‌లైఫ్)' చిత్రానికి గాను ఈ అవార్డును అందుకున్నాడు పృథ్వీరాజ్. ఉత్తమ నటిగా సీనియర్ నటి ఊర్వశితో పాటు నటి బీనా ఆర్ చంద్రన్ అవార్డును అందుకోగా ఉత్తమ చిత్రంగా మమ్ముట్టి నటించిన కాథల్ ది కోర్ చిత్రం అవార్డును అందుకుంది. మరోవైపు ది గోట్‌లైఫ్ చిత్రం ఏకంగా 9 అవార్డులు గెలుచుకుంది. ఉత్తమ చిత్రం %-% కాథల్ ది కోర్ఉత్తమ నటి %-% ఊర్వశి (ఉల్లోఝుక్కు), బీనా ఆర్ చంద్రన్ (తడవు)ఉత్తమ నటుడు %-% పృథ్వీరాజ్ సుకుమారన్ (ఆడుజీవితం)ఉత్తమ దర్శకుడు %-% బ్లెస్సీ (ఆడుజీవితం)ఉత్తమ ద్వితీయ చిత్రం %-% ఇరట్ట (రోహిత్ ఎంజీ కృష్ణన్)ఉత్తమ బాల నటి %-% తెన్నల్ అభిలాష్ %-% శేషం మైకిల్ ఫాతిమాఉత్తమ బాల నటుడు %-% అవిర్త్ మీనన్ %-% పచువుం అద్భుత విళక్కుంఉత్తమ సహాయ నటి %-% శ్రీష్మా చంద్రన్ (పొంబళై ఒరుమై)ఉత్తమ సహాయ నటుడు %-% విజయరాఘవన్ (పూక్కాలం)ఉత్తమ నేపథ్య గాయకుడు (పురుషుడు) %-% విద్యాధరన్ మాస్టర్ (జననం 1947 ప్రణయం తుడురున్ను)ఉత్తమ నేపథ్య సంగీతం %-% మాథ్యూస్ పులిక్కల్ (కాథల్: ది కోర్)ఉత్తమ సంగీత దర్శకుడు %-% జస్టిన్ వర్గీస్ (చావేర్)ఉత్తమ అనువాదిత స్క్రీన్ ప్లే %-% బ్లెస్సీ (ఆడుజీవితం)ఉత్తమ నూతన దర్శకుడు %-% ఫాజిల్ రజాక్ఉత్తమ డబ్బింగ్ కళాకారుడు (పురుషుడు) %-% రోషన్ మాథ్యూ (ఉల్లోఝుక్కు)ఉత్తమ డబ్బింగ్ కళాకారిణి (స్త్రీ) %-% సుమంగళ (స్త్రీ %-% జననం 1947 ప్రణయం తుడురున్ను)ఉత్తమ దుస్తుధారణ %-% ఫెమినా జబ్బార్ (ఓ. బేబీ)ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్ ప్లే %-% రోహిత్ ఎంజీ కృష్ణన్ (ఇరట్ట)ఉత్తమ సాహిత్యం %-% హరీష్ మోహనన్ (చెంతామర పూవిల్ %-% చావేర్)ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ %-% రంజిత్ అంబాడి (ఆడుజీవితం)ఉత్తమ సౌండ్ రికార్డింగ్ %-% జయదేవన్ చక్కడత్, అనిల్ దేవన్ (ఉల్లోఝుక్కు)ఉత్తమ ఎడిటింగ్ %-% సంగీత్ ప్రతాప్ (లిటిల్ మిస్ రావ్‌థర్)ఉత్తమ సౌండ్ మిక్సింగ్ %-% రసూల్ పూక్కుట్టి, శరత్ మోహన్ (ఆడుజీవితం)ఉత్తమ సౌండ్ డిజైన్ %-% జయదేవన్ చక్కడత్, అనిల్ రాధాకృష్ణన్ (ఉల్లోఝుక్కు)ఉత్తమ కళా దర్శకత్వం %-% మోహన్ దాస్ (2018) ఫాజిల్ రజాక్ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ %-% ఆంద్రూ డి క్రూజ్, విశాక్ బాబు (2018)ఉత్తమ నృత్య దర్శకుడు %-% జిష్ణు (సులేఖ మంజిల్)ఉత్తమ ప్రాసెసింగ్ ల్యాబ్/కలరిస్ట్ %-% వైశాల్, శివ గణేష్ (ఆడుజీవితం)మహిళలు/ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల కోసం ప్రత్యేక జ్యూరీ అవార్డు %-% దర్శకురాలు షాలిని ఉషాదేవి (ఎన్నెన్నుమ్)సినిమా కళ యొక్క ఏదైనా అంశంలో అత్యుత్తమ ప్రతిభకు ప్రత్యేక అవార్డు %-% గగనచారి ఉత్తమ సాహిత్య రచన %-% మళవిల్ కన్నిలూడే సినిమాప్రత్యేక ప్రస్తావన %-% కెఆర్ గోకుల్ (ఆడుజీవితం)ప్రత్యేక ప్రస్తావన %-% కృష్ణన్ (జైవం)ప్రత్యేక ప్రస్తావన %-% సుధి కోజికోడ్ (కాథల్: ది కోర్)






## ఘనంగా నటి అభినయ వివాహం

**చిరకాల ప్రియుడు కార్తీక్‌తో ఏడడుగులు వేసిన అభినయ**
**జూబ్లీహిల్స్‌లోని జెఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో పెళ్లి వేడుక**
**నూతన వధూవరులను ఆశీర్వదించిన బంధుమిత్రులు**
**ఈ నెల 20న రిసెప్షన్ వేడుక**

బహుభాషా నటి అభినయ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఆమె తన చిరకాల ప్రియుడు, హైదరాబాద్‌కు చెందిన వేగేశ్న కార్తీక్(సన్నీ వర్మ)తో ఏడడుగులు వేశారు. జూబ్లీహిల్స్‌లోని జెఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో వీరి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అభినయ, కార్తీక్ చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. ఆ స్నేహం ప్రేమగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్న వీరు పెద్దల అంగీకారంతో పెళ్లి బంధంలోకి అడుగు పెట్టారు. అభినయ 2008లో రవితేజ హీరోగా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'నేనింతే' సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తున్నారు. ఆమె నటించిన 'ముక్తి అమ్మన్' అనే సినిమా షుటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. అభినయ గతంలో తమిళ స్టార్ హీరో విశాల్‌తో కలిసి 'మార్క్ ఆంటోనీ' అనే సినిమాలో నటించారు. ఆ క్రమంలో ఇద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, రహస్యంగా నిశ్చితార్థం కూడా జరిగిపోయిందని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఆ పుకార్లపై విశాల్‌తో పాటు అభినయ కూడా స్పందించారు. అప్పుడే తన లాంగ్ టర్మ్ రిలేషన్, ప్రియుడి గురించి మీడియాకు అభినయ వివరించడంతో పాటు కార్తీక్ ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసి పుకార్లకు చెక్ పెట్టారు. ఈ క్రమంలో మార్చి 9న అభినయ, కార్తీక్ నిశ్చితార్థం జరిగింది. నిన్న వివాహ బంధంతో ఇద్దరూ ఒకటయ్యారు. ఈ నెల 20న రిసెప్షన్ నిర్వహించనున్నారు.






## మే 18న యమదొంగ సినిమా రీరిలీజ్

ఇటీవల టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ మొదలైన విషయం తెలిసిందే.హీరోల బర్త్‌డేలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా,పెద్ద పండుగలా సెలెబ్రేట్ చేసుకుంటారు ఫ్యాన్స్. అభిమానులు సోషల్ మీడియాలో సెలబ్రేషన్లు చేస్తూ, తమ అభిమాన హీరోకి విషెస్ చెప్పడమే కాకుండా, అప్పట్లో విడుదలై సంచలనం సృష్టించిన హిట్ సినిమాలను మళ్లీ రీరిలీజ్ చేస్తూ ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇస్తున్నారు.ఈ రీ-రిలీజ్ కల్చర్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నింపుతోంది.ఎన్టీఆర్ బర్త్ డే రానుండగా, ఈ సందర్భంగా ఎన్టీఆర్-రాజమౌళి కాంబోలో వచ్చిన యమదొంగ చిత్రాన్ని రీరిలీజ్ చేయనున్నారట. 2007లో విడుదలైన సోషియో ఫాంటసీ చిత్రంలో మోహన్ బాబు, ఆలీ, మమతా మోహన్ దాస్, ప్రియమణి, నవనీత్ కౌర్, మాస్టర్ శ్రీ సింహా నటించారు. మోహన్ బాబు యముడిగా, ఎన్.టి.ఆర్. మానవుడిగా అదరగొట్టేశారు. ఇందులోని సాంగ్స్ కూడా సూపర్ హిట్.

ఎన్టీఆర్ బర్త్ డే మే 20న కాగా,ఈ సందర్భంగా 'యమదొంగ' సినిమాను మే 18వ తేదీన రీరిలీజ్ చేస్తున్నారు, ఆ రోజుతో పాటు 19, 20వ తేదీలలో కూడా ఈ చిత్రం థియేటర్లలో సందడి చేస్తుంది. యమదొంగ'గా ఎన్టీఆర్ హంగామా థియేటర్లలో ఆ మూడు రోజులే ఉంటుంది అని అనుకుంటే పొరపాటు పడ్డట్టే. ప్రేక్షకుల ఆదరణని బట్టి ఈ మూవీని కంటిన్యూ చేసే ఛాన్సులు కూడా లేకపోలేదు ఈ విషయాన్ని మైత్రీమూవీస్ నిర్మాణ సంస్థ తెలియజేసింది. మైత్రీ అధినేత చెర్రి, ఊర్మిళ నిర్మాతలుకాగా, రమా రాజమౌళి సమర్పణలో ఈ చిత్రం రూపొందింది. యుముడి పాత్రలో మోహన్ బాబు చేస్తేనే సినిమా చేయగలనంటూ రాజమౌళి పట్టుబట్టాడు.యముడుకి, ఎన్.టి.ఆర్.కు మధ్య యమలోకంలో సాగే డైలాగ్ లు ప్రతి ఒక్క ప్రేక్షకుడిని ఎంతగానో అలరిస్తుంటాయి.భవిష్యత్తులో కూడా ఈ చిత్రాన్ని మళ్లీ విడుదల చేయడానికి అడ్వాన్స్ టెక్నాలజీ ద్వారా 'యమదొంగ' సినిమా ప్రింట్ 8కేలో రీస్టోర్ చేశారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు 4కేలో స్పెషల్ షోస్ వేయడానికి రెడీ అయ్యారు. ఏపీ, తెలంగాణ ఈ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికాలోనూ ఎంపిక చేసిన కొన్ని థియేటర్లలో ఈ సినిమా మళ్లీ విడుదల కానుంది. కొత్త వర్షెన్‌లో విడుదల కానున్న యమదొంగ చిత్రం ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి.




## రియాక్ట్ అవ్వకపోవడంతో చాలా రిగ్రేట్ ఫీల్ అయ్యా: నజ్రియా

నజ్రియా రాజా రాణి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయింది. 2014లో అంజలి రచన దర్శకత్వం వహించిన బెంగుళూరు డేస్ చిత్రంలో నజ్రియా నటించింది. ఇందులో ఫహద్ ఫాజిల్ నజ్రియా భర్తగా నటించాడు. ఈ సినిమా సమయంలోనే ఈ ఇద్దరూ ప్రేమలో పడ్డారు. దాని తర్వాత నిజ జీవితంలో భార్యాభర్తలుగా మారిపోయారు.పెళ్లి తర్వాత ఈ జంట తమ సినిమాలతో బిజీగా ఉన్నారు. నజ్రియా మలయాళంలో సినిమాలు చేస్తుంటే ఫహద్ ఫాజిల్ రీసెంట్ గా తెలుగులో పుష్ప 2తో భారీ హిట్ అందుకున్నాడు. మలయాళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మలయాళ బ్యూటీ నజ్రియా నాజిమ్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో సైలెంట్ అయిపోయింది. గత ఏడాది డిసెంబర్‌లో చివరగా పోస్ట్ వేసింది. తన చిత్రం సూక్ష్మదర్శిని బ్లాక్ బస్టర్ అయినా కూడా ఎవరి కాల్స్‌కు స్పందించలేదట. ఫ్రెండ్స్, ఫ్యామిలీ, సినీ ఫ్యామిలీ నుంచి ఎవ్వరు ఫోన్ చేసినా కూడా స్పందించలేదట. ఎవ్వరికీ అందుబాటులో లేకుండా పోయిందట. ఈ విషయాలన్నీ చెబుతూ అందరికీ సారీ చెప్పింది నజ్రియా. అందరినీ క్షమించమని కోరుతూ ఓ ప్రెస్ నోట్ రిలీజ్ చేసింది.నజ్రియా ఇన్ని రోజులు సోషల్ మీడియాకి దూరంగా ఉందట. అస్సలు ఎవ్వరి ఫోన్‌లు లిఫ్ట్ చేయలేదట. తాను ఇన్ని రోజులుగా కాస్త డిప్రెషన్‌లో ఉందట. కొన్ని గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొందట. అందుకే ఎవ్వరికీ కాంటాక్ట్‌లో లేదట. తన సూక్ష్మదర్శిని సినిమా హిట్ అయిన తరువాత ఎంతో మంది ప్రశంసించేందుకు ఫోన్లు కూడా చేశారట. కానీ ఎవ్వరి ఫోన్లు కూడా లిఫ్ట్ చేయలేదట. దీంతో అందరికీ సారీ చెబుతూ నజ్రియా పోస్ట్ చేసింది.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339